







కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి దేవస్థానం


నల్లపాటి వెంకట్రామయ్య చౌదరి


చాపలమడుగు రామయ్య చౌదరి


కాసు బ్రహ్మానందరెడ్డి



దొండేటి కృష్ణారెడ్డి


డాక్టర్ కోడెల శివప్రసాదరావు


కాసు వెంకట కృష్ణారెడ్డి


డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

ఉద్దండుల కోట.. నరసరావుపేట



రాజకీయాలకు రాజధాని, కళలకు కాణాచి, ఉద్యమాలకు ఊపిరి, సాహిత్యానికి సాగర సంగమం... ఇలా నరసరావుపేట అసెంబ్లీ నియోజకవర్గం అన్ని రంగాల్లో రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందింది. ఫ్యాక్షన్ రాజకీయాలకు, బాంబుల సంస్కృతికి, కులాల పోరుకు కొన్నేళ్లు వేదికగా నిలిచింది. రాష్ట్రంలోనే కాక దేశంలోనే ఒక విశిష్టమైన స్థానాన్ని సొంతం చేసుకుంది. ఇలాంటి గుర్తింపును రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి తీసుకువచ్చారు. దేశంలోనే అనేక ఉన్నత పదవులు అలకరించిన కాసు బ్రహ్మానందరెడ్డి ఇక్కడి నుంచే రాజకీయాలను శాసించారు. రాజకీయ ఉద్దండులకు నరసరావుపేట నిలయం. ఇక్కడినుంచి శాసన సభ్యులుగా గెలుపొందిన వారిలో ముగ్గురు మినహా మిగిలిన నేతలందరూ అత్యున్నత పదవులను అలంకరించటం విశేషం. వరుసగా ఐదుసార్లు కోడెల శివప్రసాదరావు విజయం సాధించారు. మూడు సార్లు ఇక్కడినుంచి ఎమ్మెల్యేగా కాసు వెంకట కృష్ణారెడ్డి గెలుపొందారు. ఆంధ్రరాష్ట్ర తొలి స్పీకరుగా నల్లపాటి వెంకట్రామయ్య చౌదరి, రాష్ట్ర ముఖ్యమంత్రిగా కాసు బ్రహ్మానందరెడ్డి, నవ్యాంధ్ర తొలి శాసన సభాపతిగా డాక్టర్ కోడెల శివప్రసాదరావు, మంత్రిగా కాసు వెంకట కృష్ణారెడ్డిలు పని చేయటంతో ఈ నియోజకవర్గం ప్రత్యేకత సంతరించుకుంది.

- ఎమ్మెల్యేలుగా ఎన్నికైంది ఏడుగురే..!
- ముఖ్యమంత్రి.. కేంద్రమంత్రి.. గవర్నర్‌గా కాసు బ్రహ్మానందరెడ్డి
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి స్పీకరుగా నల్లపాటి వెంకట్రామయ్య చౌదరి
- నవ్యాంధ్రప్రదేశ్ తొలి స్పీకర్‌గా డాక్టర్ కోడెల శివప్రసాదరావు
- వరుసగా ఐదుసార్లు గెలిచిన కోడెల
- మూడు సార్లు అసెంబ్లీకి వెళ్ళిన కాసు

ఓటర్లు

మొత్తం ఓట్లు	:	2,29,533
పురుషులు	:	1,11,756
మహిళలు	:	1,17,748
థర్డ్ జండర్	:	29

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాకు గుంటూరు కేంద్రం అయినప్పటికీ రాజకీయాలకు కేంద్రంగా నరసరావుపేట భాసిల్లింది. 1952లో ఈ నియోజక వర్గం ఏర్పడింది. ఇప్పటికి 15 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఏడుగురు అభ్యర్థులు మాత్రమే ఇప్పటివరకు ఎన్నిక కావటం విశేషం. 1952కు ముందు నరసరావుపేట నియోజకవర్గం వినుకొండ, మాచర్ల, గురజాల నియోజకవర్గాలతో కలసి వుండేది. నరసరావుపేట కేంద్రంగా ఏర్పాటైన అసెంబ్లీ నియోజకవర్గంలో 2006లో జరిగిన పునర్విభజన అనంతరం మునిసిపాలిటీతో పాటు రొంపిచర్ల, నరసరావుపేట రూరల్ మండలాలు వున్నాయి.

తొలి ఎన్నికలో..

1952లో జరిగిన తొలి ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి సోదరుడు కాసు వెంగళరెడ్డిపై కేఎంపీ పార్టీ తరఫున నల్లపాటి వెంకట్రామయ్య చౌదరి గెలుపొందారు. నల్లపాటి ఆంధ్ర రాష్ట్ర తొలి స్పీకరుగా పనిచేశారు. 1955లో నల్లపాటి వెంకట్రామయ్య చౌదరి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి సీపీఐ అభ్యర్థి కె.రంగారావుపై వరుసగా రెండవ సారి విజయం సాధించారు. 1962లో చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలేనికి చెందిన చాపలమడుగు రామయ్య చౌదరి గెలుపొందారు. ఆయన తొలి పార్లమెంట్‌కు నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికయ్యారు. 1967లో జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర్య పార్టీ అభ్యర్థి కొత్తూరి వెంకటేశ్వర్లుపై మాజీ సీఎం కాసు బ్రహ్మానందరెడ్డి విజయం సాధించారు. కొత్తూరు వెంకటేశ్వర్లు 1962, 1967, 1972 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా, 1978 ఎన్నికల్లో జనతా పార్టీ అభ్యర్థిగా వరుసగా నాలుగు సార్లు పోటీ చేసి ఓటమి చెందారు.

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో..

1983 వరకు నరసరావుపేట నియోజక వర్గం కాసు వంశానికి కంచుకోటగా వుంది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో కాసు కోటకు బీటలు వారాయి. ఎన్‌టీఆర్ పిలుపుతో రాజకీయాల్లోకి వచ్చిన డాక్టర్ కోడెల శివప్రసాదరావు 1983లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి నరసరావుపేట నుంచి విజయం సాధించారు. అప్పటి నుంచి 1999 వరకు వరుసగా ఐదుసార్లు కోడెల విజయకేతనం ఎగుర వేశారు. 2004, 2009లో జరిగిన ఎన్నికల్లో కాసు వెంకట కృష్ణారెడ్డి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి తెలుగుదేశం అభ్యర్థి కోడెలపై వరుసగా రెండుసార్లు విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో తెలుగుదేశం పొత్తుతో బీజేపీ ఇక్కడ పోటీ చేసింది. బీజేపీ అభ్యర్థి డాక్టర్ నలబోతు వెంకటరావుపై వైసీపీ అభ్యర్థిగా డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శాసన సభ్యుడిగా విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో వరుసగా రెండోసారి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే 32,277ఓట్ల మెజార్టీతో రికార్డు నెలకొల్పారు. ఇప్పటివరకు ఇదే అత్యధిక మెజార్టీ కావడం విశేషం. నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేలుగా నల్లపాటి వెంకట్రామయ్య చౌదరి, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఎన్నికయ్యారు. చాపలమడుగు రామయ్య చౌదరి, దొండేటి కృష్ణారెడ్డి వీరు ఒక్కసారి మాత్రమే శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు.

నియోజకవర్గ చరిత్ర

సంవత్సరం	విజేత	పార్టీ	రన్నరప్	పార్టీ	ఆధిక్యం
1952	నల్లపాటి వెంకట్రామయ్య	కేఎంపీపీ	కేవీరెడ్డి	కాంగ్రెస్	4,574
1955	నల్లపాటి వెంకట్రామయ్య	కాంగ్రెస్	కే రంగారావు	సీపీఐ	12,063
1962	చాపలమడుగు రామయ్యచౌదరి	కాంగ్రెస్	కొత్తూరి వెంకటేశ్వర్లు	స్వతంత్ర	2,656
1967	కాసు బ్రహ్మానందరెడ్డి	కాంగ్రెస్	కొత్తూరి వెంకటేశ్వర్లు	స్వతంత్ర	13,699
1972	దొండేటి కృష్ణారెడ్డి	కాంగ్రెస్	కొత్తూరి వెంకటేశ్వర్లు	స్వతంత్ర	14,587
1978	కాసు వెంకట కృష్ణారెడ్డి	కాంగ్రెస్	కొత్తూరి వెంకటేశ్వర్లు	జనత	6,905
1983	డాక్టర్ కోడెల శివప్రసాదరావు	టీడీపీ	బీ సుబ్బారెడ్డి	కాంగ్రెస్	14,557
1985	డాక్టర్ కోడెల శివప్రసాదరావు	టీడీపీ	కాసు వెంకట కృష్ణారెడ్డి	కాంగ్రెస్	2,064
1989	డాక్టర్ కోడెల శివప్రసాదరావు	టీడీపీ	ఎం రాధాకృష్ణమూర్తి	కాంగ్రెస్	9,155
1994	డాక్టర్ కోడెల శివప్రసాదరావు	టీడీపీ	దొడ్డా బాలకోటిరెడ్డి	కాంగ్రెస్	9,300
1999	డాక్టర్ కోడెల శివప్రసాదరావు	టీడీపీ	కాసు వెంకట కృష్ణారెడ్డి	కాంగ్రెస్	14,306
2004	కాసు వెంకటకృష్ణారెడ్డి	కాంగ్రెస్	కోడెల శివప్రసాదరావు	టీడీపీ	15,495
2009	కాసు వెంకటకృష్ణారెడ్డి	కాంగ్రెస్	కోడెల శివప్రసాదరావు	టీడీపీ	5,971
2014	డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి	వైసీపీ	నలబోతు వెంకటరావు	బీజేపీ	15,766
2019	డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి	వైసీపీ	చదలవాడ అరవిందబాబు	టీడీపీ	32,277

విశిష్టత..

నియోజక వర్గానికి రాజకీయ ఖిల్లాగా పేరుంది. మల్రాజు వంశస్థులు ఇక్కడ జమిందారులుగా వున్నారు. 1797 నుంచి నరసరావుపేట కేంద్రంగా జమీందారుల పరిపాలన కొనసాగింది. 1952 వరకు ఇక్కడ పరిపాలన అంతా జమిందారుల చేతు ల్లోనే వుండేది. నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి రాజకీయాలకు వేదికగా మారింది. స్వాతంత్రోద్యమంలో త్రివేణి పత్రికను నిర్వహించి కోలవెన్ను రామకోటేశ్వరరావు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందారు. రాజకీయాల్లో కాసు వెంగళరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి, నల్లపాటి వెంకట్రామయ్య చౌదరి, కాసు వెంకట కృష్ణారెడ్డి, డాక్టర్ కోడెల శివప్రసాదరావులు రాష్ట్రంలోనే గుర్తింపు పొందిన నాయకులు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణం అనంతరం నియోజకవర్గం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందింది. ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి ఆలయం రాష్ట్ర ప్రసిద్ధి చెందింది. కోటప్పకొండ శైవక్షేత్రం అసాధారణ అభివృద్ధి చెందింది. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ కోటప్పకొండకు ఘాట్‌రోడ్డుకు శ్రీకారం చుట్టారు. సీఎంగా చంద్రబాబు హయాంలో ఘాట్‌రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రారంభించారు. శ్రీ త్రికోటేశ్వరస్వామి దేవాలయం పునర్‌నిర్మాణం చేశారు. కోటప్పకొండ అభివృద్ధికి డాక్టర్ కోడెల శివప్రసాదరావు విశేషంగా కృషి చేశారు. పర్యాటక కేంద్రంగా కూడా గుర్తింపు వుంది. కోటప్పకొండ తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదా కల్పించేందుకు కాసు వెంకటకృష్ణారెడ్డి కృషి చేశారు. నరసరావుపేట పట్టణ రక్షిత మంచినీటి పథకం దేశంలోనే అరుదైనది. రూపాయి ఖర్చు లేకుండా విద్యుతుతో పనిలేకుండా పట్టణానికి రెండు పూటలా తాగునీటిని అందిస్తున్న ఘనత పథకం సొంతం. పూర్తిగా గ్రావిటీపై నీటి సరఫరా జరుగుతుంది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా వేసవిలో కూడా రెండు పూటలా నరసరావుపేటలో మంచి నీటి సరఫరా జరుగుతుండటం విశేషం.

నియోజకవర్గ ముఖచిత్రం



నియోజక వర్గ స్వభావం..

ఇక్కడ జరిగే ఎన్నికల్లో పట్టణ ఓటర్ల తీర్పుపై అభ్యర్థుల గెలుపు ఓటములు ఆధారపడి వుంటాయి. పట్టణ ఓటర్ల కంటే గ్రామాలలో ఓటర్ల సంఖ్య అధికం. గ్రామాలు పార్టీల వారీగా విభజించబడి వున్నాయి. రాజకీయ సమీకరణల వారీగా గ్రామాల్లో ఓట్లు పోలవుతాయి. ఈ నేపథ్యంలో పట్టణవాసులు తీసుకొనే నిర్ణయం పైనే అభ్యర్థుల విజయం ఆధారపడి వుంది.

మళ్లీ డాక్టర్ల మధ్యే పోటీ

నరసరావుపేట అసెంబ్లీ స్థానానికి ఇరువురు డాక్టర్లు ఎన్నికల బరిలో దిగారు. తెలుగుదేశం అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, వైసీపీ అభ్యర్థిగా డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తలపడుతున్నారు. వీరు ఇరువురు 2019 ఎన్నికల్లో పోటీ చేశారు. చదలవాడపై గోపిరెడ్డి గెలుపొందారు. మరోసారి వీరు ఇద్దరు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. గత ఎన్నికల్లో ఓటమి చెందిన అరవిందబాబుకు నియోజకవర్గ ఓటర్ల నుంచి సానుభూతి లభిస్తోంది. ఇరువురి మధ్య పోరు పోటాపోటీగా సాగుతోంది. తనకు ఒక ఛాన్స్ ఇవ్వాలని ఓటర్లుకు అరవిందబాబు విజ్ఞప్తి చేస్తున్నారు.

మూడుసార్లు ఎమ్మెల్యేగా కాసు కృష్ణారెడ్డి..

1978లో జరిగిన ఎన్నికల్లో రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కాసు వెంకట కృష్ణారెడ్డి ఆవుదూడ గుర్తుపై గెలుపొందారు. రాష్ట్రమంత్రిగా పనిచేశారు. 1985, 1999 ఎన్నికల్లో పరాజయం పాలైన కాసు, 2004, 2009లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నరరావుపేట ఎమ్మెల్యేగా విజయం సాధించారు. కృష్ణారెడ్డి రాష్ట్ర ఆహార, పౌర సరఫరాలు, తూనికలు, కొలతలు, పౌర సంబంధాల శాఖ, రాష్ట్ర సహకార శాఖ మంత్రిగా కాసు పని చేశారు. కోట్లాది రూపాయలతో నియోజకవర్గంలో విస్తృతంగా కాసు అభివృద్ధి పనులు చేపట్టారు. నరసరావుపేట నుంచి కాసుకు కుటుంబానికి చెందిన ముగ్గురు నేతలు పోటీ చేశారు. కాసు బ్రహ్మానందరెడ్డి, అయన సోదరుడు కాసు వెంగళరెడ్డి, వెంగళరెడ్డి కుమారుడు కాసు వెంకట కృష్ణారెడ్డి పోటీ చేశారు. వెంగళరెడ్డి ఓటమి చెందారు. ఈ కుటుంబానికి చెందిన మూడవ తరం కృష్ణారెడ్డి కుమారుడు కాసు మహేష్‌రెడ్డికి గత ఎన్నికల్లో ఇక్కడ నుంచి పోటీచేసే అవకాశం దక్కకపోవడంతో అయన గురజాల నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

నరసరావుపేట అసెంబ్లీ సెగ్మెంట్‌లో కులాల వారీగా ఓట్ల వివరాలు

కులం	మునిసిపాల్టీ	నరసరావుపేట రూరల్	రొంపిచర్ల	మొత్తంఓట్లు
కమ్మ	7,242	11,801	8,771	27,314
రెడ్డి	6,409	8,689	12,395	27,493
ముస్లీం	17,943	8,653	1,940	28,536
కాపు	15,474	4,615	2,874	22,963
మాదిగ	7,285	8,480	5,390	21,075
మాల	3,754	7,694	4,565	16,013
వడ్డెర	8,776	4,121	3,781	16,678
వైశ్య	13,543	785	778	15,106
యాదవ	3,085	4,380	2,955	10,420
రజక	2,022	2,520	1,795	6,337
ముదిరాజ్	2,035	3,049	521	5,605
ఎరుకల	1,485	1,775	1,177	4,387
యానాది	1,840	825	1,230	3,895
బ్రాహ్మణ	2,620	465	365	3,450
నాయి బ్రాహ్మణ	1,879	818	130	2,875
తొగటి	1,905	202	285	2,392
విశ్వ బ్రాహ్మణ	1,687	260	315	2,262
పద్మశాలి	1,630	85	34	1,749
ఆరెమరాట	1,445	16	29	1,490

దేశ రాజకీయాలను శాసించిన 'కాసు'

నరసరావుపేట నుంచి కాసు బ్రహ్మానందరెడ్డి దేశ రాజకీయాలను శాసించారు. మారుమూల గ్రామమైన నాదెండ్ల మండలం తూబాడు రైతు కుటుంబంలో జన్మించిన కాసు బ్రహ్మానందరెడ్డి అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్ర ముఖ్యమంత్రిగానే కాక కేంద్రంలో సైతం ఎన్నో ప్రతిష్టాత్మక పదవులు అలంకరించారు. చేపట్టిన ప్రతి పదవికి వన్నె తెచ్చిన ఘనత బ్రహ్మానందరెడ్డిది. జాతీయోద్యమం కాలంలో జిల్లాలో జరిగే ప్రతి ప్రతి కార్యక్రమంలో ముందుడేవారు. సత్యాగ్రహ ఉద్యమం సందర్భంగా నాలుగు నెలలు బ్రహ్మానందరెడ్డి కారాగార శిక్ష అనుభవించారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పనిచేసి జైలులో 1945 జనవరి వరకు ఉన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ ప్రధాన పాత్ర పోషించి లాల్ బహదూర్ శాస్త్రి ప్రదాని కావటానికి కారకులయ్యారు. 1956లో రాష్ట్ర ఆర్థికశాఖ బాధ్యతను చేపట్టారు. బ్రహ్మానందరెడ్డి ఆ తర్వాత రాష్ట్రముఖ్య మంత్రి అయ్యారు. రాష్ట్ర మూడో ముఖ్యమంత్రిగా 1964 ఫిబ్రవరి 23న ప్రమాణ స్వీకారం చేశారు. 1971 సెప్టెంబరు 2 వరకు సీఎంగా కొనసాగారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బ్రహ్మానందరెడ్డి రికార్డును అధిగమించారు. ఆవుదూడ గుర్తుతో 1978 ఎన్నికల్లో రాష్ట్రంలో బ్రహ్మానందరెడ్డి పార్టీ పోటీ చేసింది. 30 అసెంబ్లీ స్థానాలను గెల్చుకొంది. అనంతరం ఇందిర, బ్రహ్మానందరెడ్డి కాంగ్రెస్ పార్టీలు విలీనం అయ్యాయి. కేంద్ర ప్రభుత్వంలో కమ్యూనికేషన్లు, హోంశాఖ, పరిశ్రమల శాఖలను సమర్థంగా నిర్వహించారు. ఆయన ఆయా శాఖలకు మంత్రిగా ఉన్న కాలంలో అనేక సంస్కరణలు చేపట్టారు. ఏఐసీసీ అధ్యక్షుడిగా, మహరాష్ట్ర గవర్నర్‌గా పనిచేశారు. వ్యవసాయ అభివృద్ధికి కృషిచేశారు. నాగార్జున సాగర్ క్రస్ట్ గేట్ల నిర్మాణానికి కృషి చేశారు. నరసరావుపేట పట్టణ ప్రజలకు మొదటిసారిగా రక్షిత మంచి నీటి పథకం చేపట్టి రక్షిత నీటిని అందించిన ఘనత ఆయనకు దక్కింది. 1994 మే 20న ఆయన మృతిచెందారు.

కోడెల 'కోట'

నరసరావుపేట నియోజకవర్గంలో మంత్రి డాక్టర్ కోడెల శివప్రసాదరావు సుస్థిర స్థానాన్ని సంపాదించారు. రెండు దశాబ్దాలకుపైగా ఇక్కడ కోడెల హవా కొనసాగింది. పట్టణంలో వైద్యవృత్తిలో ఉన్న కోడెల.. ఎన్టీఆర్ పిలుపుతో రాజకీయ రంగప్రవేశం చేశారు. 1983 వరకు కాసు వంశానికి నరసరావుపేట కంచుకోటగా ఉంది. 1983 అసెంబ్లీ ఎన్నికల్లో కోడెల పోటీచేసి విజయం సాధించారు. అప్పటినుంచి నరసరావుపేట కోడెల కోటగా మారిపోయింది. వరుసగా ఐదు సార్లు గెలుపొందారు. మంత్రిగా ఐదు క్యాబినెట్ శాఖలు సమర్థంగా నిర్వహించారు. 1987లో హోంమంత్రిగా తొలిసారి మంత్రి పదవిని చేపట్టారు. 1995లో భారీ, మధ్యతరహా నీటి పారుదల శాఖ మంత్రిగా పనిచేశారు. 1996లో మంత్రివర్గ మార్పుల్లో పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రిగా 1999వరకు కొనసాగారు. 2001లో తిరిగి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2002లో జరిగిన మంత్రివర్గ మార్పులు చేర్పుల్లో కోడెల వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేశారు. 2014 ఎన్నికల్లో ఆరవసారి ఎమ్మెల్యేగా సత్తెనపల్లి నుంచి గెలుపొంది నవ్యాంధ్రప్రదేశ్ తొలి స్పీకర్‌గా పనిచేశారు. నరసరావుపేట నియోజకవర్గ అభివృద్ధిలో ఆయనది చెరగని ముద్ర. కోడెల అంటే అభివృద్ధి.. అభివృద్ధి అంటే కోడెల అన్నంతగా గుర్తింపు పొందారు. పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు కోడెల రక్షితత మంచినీటి పథకాన్ని విస్తరింపచేశారు. అయన కృషి ఫలితంగా పట్టణంలో రెండు పూటలా నీటి సరఫరా జరుగుతోంది. పట్టణ రూపురేఖలు మార్చిన ఘనత అయనది. పట్టణంలో రోడ్ల విస్తరణ, నూతన రహదారుల నిర్మాణం, క్రీడా ప్రాంగణం, సాంస్కృతిక కేంద్రం భువన చంద్ర టౌన్ హాలు, రోడ్ల విద్యుదీకరణ, పార్కుల నిర్మాణం, షాదీఖానా, స్కూల్ భవనాలు, తదితర పనులను పూర్తి చేయడంలో కోడెల కీలక పాత్ర పోషిం చారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో విస్తృతంగా అభివృద్ధి చేశారు. 2019 సెప్టెంబర్ 16న ఆయన మృతి చెందారు.

వినుకొండ
తహసీల్దార్ కార్యాలయానికి నోటీసు

- రూ.20 లక్షల బకాయి వసూళ్లపై రంగంలోకి విద్యుత్ అధికారులు

వినుకొండ టౌన్, మార్చి 26: ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి విద్యుత్ బకాయిలు పేరుకుపోతున్నాయి.. బిల్లుల చెల్లింపులపై ప్రభుత్వం దృష్టి సారించడంలేదు. ఈ పరిస్థితుల్లో వినుకొండ తహసీల్దారు కార్యాలయానికి విద్యుత్ అధికారులు మంగళవారం నోటీసు ఇచ్చారు. కార్యాలయానికి రూ.2000889 కరెంటు బిల్లు చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తం చెల్లించాలంటూ విద్యుత్‌శాఖ అధికారులు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుబ్బారావుకు నోటీసు అందజేశారు. అంతమొత్తం బిల్లు బకాయి ఉండటం చూసిన ఆయన ఆశ్చర్యపోయారు. ఎన్నికల అంశాలను మాత్రమే తమ దృష్టికి తీసుకురావాలని, కరెంటు బిల్లు విషయాన్ని స్థానిక సిబ్బందికి అందజేయాలని ఆయన విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. వెంటనే అందుబాటులో ఉన్న డిప్యూటి తహసీల్దార్ అబ్బూరి వెంకటేశ్వర్లును పిలిచి బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం నుంచి ఫండ్ ఏమీ రావడం లేదా అని ప్రశ్నించారు. బకాయిలుపై కలెక్టర్‌కు లెటర్ పెట్టాలని సూచించారు. విద్యుత్ సర్వీస్‌ను తొలగించవద్దని విద్యుత్‌శాఖ అధికారులను ఆర్వో కోరారు.


ఆర్వో సుబ్బారావుకు నోటీసు అందజేస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) 6.25(బుధవారం)
సహోరీ (ఉదయం) 4.50 (గురువారం)

ఎన్నికల కోడ్ వర్తించదా..!


జెర్రివాగు పంపుహౌస్‌కు వైసీపీ రంగులు


జెర్రివాగు ఓవర్‌హెడ్ ట్యాంకుకు వైసీపీ రంగులు


గొట్టిపాళ్లలో ఇళ్లపట్టాల పంపిణీ శిలాఫలకం


గురజాలలో వైసీపీ రంగులుతో ఉన్న శిలాఫలకం, బల్లలు

గురజాల టౌన్, మార్చి 26: మండలంలో చాలా చోట్ల శిలాఫలకాలు, బల్లలకు వైసీపీ రంగులు దర్శనమిస్తున్నాయి. కాగా టీడీపీకి సంబంధించిన అభివృద్ధి శిలాఫలకాలకు ఎన్నికల కోడ్ వచ్చిన రెండోరోజే పేపర్లు అంటించారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి, శ్రీపాతపాటేశ్వరి అమ్మవారి దేవస్థానం తదితర చోట్ల శిలాఫలకాలు, బల్లాలకు వైసీపీ రంగులు తొలగించలేదు.

పొలాలకు బాటలు

వైసీపీ అధికారంలోకి వచ్చాక మండలంలో ఎక్కడా కూడా పొలాలకు బాటలు వేసిన దాఖలాలు లేవు. ఇప్పుడు మండలంలోని తేలుకుట్ల గ్రామంలో పొలం బాటలు వేస్తుండగా, గొట్టిముక్కలలో పొలం బాటలకు గ్రావెల్స్ తోలుతున్నారు. ఐదేళ్లలో ఎన్నిమార్లు పొలం బాటలపై రైతులు మొరపెట్టుకున్నా పట్టించుకోని వైసీపీ నేతలు ఇప్పుడు ఓట్లు కోసం ప్రేమ నటిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


తేలుకుట్లలో పొలం బాట పనులు

కోడ్ కూసినా.. రంగు మారలేదు

వెల్దుర్తి: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి పదిరోజులు గడిచినా మండలంలో పలుచోట్ల ప్రభుత్వ భవనాలకు వైసీపీ రంగులు దర్శనమిస్తున్నాయి. శిలాఫలకాలు, రోడ్డు పక్కన హోర్డింగ్‌లపై రాజకీయ నాయకులు పేర్లు, ఫొటోలు కనిపిస్తున్నాయి. ప్రధానంగా మండల ప్రజలకు తాగునీరు అందించే జెర్రివాగు ఓవర్‌హెడ్‌ట్యాంకు, పంపుహౌస్‌లకు వైసీపీ రంగులను తొలగించలేదు. అలాగే శిరిగిరిపాడులోని మంచినీటి ట్యాంకుకు కూడా వైసీపీ రంగు దర్శనమిస్తోంది. గొట్టిపాళ్లలో ఇళ్ల పట్టాల పంపిణీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన శిలాఫలకంను మూసివేయలేదు. గ్రామ ప్రవేశంలో ఉన్న బోర్డుకు కూడా ముఖ్యమంత్రి జగన్ చిత్రం కనిపిస్తోంది.


గొట్టిముక్కలలో తోలిన గ్రావెల్

యాక్షన్ ప్యాక్డ్ షెడ్యూల్‌లో మిస్టర్ బచ్చన్



రవితేజ, హరీశ్ శంకర్ కాంబోలో తెరకెక్కుతోన్న మూడో చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్‌తో సునా హోగా' అనేది ఉపశీర్షిక. భాగ్యశ్రీ బోర్సే ఇందులో హీరోయిన్. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా యాక్షన్ ప్యాక్డ్ షెడ్యూల్ లక్నోలో మొదలైంది. ఈ కీలక షెడ్యూల్‌లో పవర్‌ఫుల్ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించనున్నారు. ఈ యాక్షన్ బ్లాక్స్ చిత్రానికే హైలెట్‌గా ఉండబోతున్నాయి. మునుపెన్నడూ చూడని సరికొత్త రవితేజను ఇందులో చూపించబోతున్నారు దర్శకుడు హరీశ్ శంకర్. ఈ చిత్రానికి నిర్మాత: టీజీ విశ్వ ప్రసాద్, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, ఎడిటింగ్: ఉజ్వల్ కులకర్ణి, డీఓపీ: అయనంక బోస్, సంగీతం: మిక్కీ జే మేయర్, ప్రొడక్షన్ డిజైనర్: అవినాశ్ కొల్లా.

150 థియేటర్లలో జరగండి పాట



రామ్‌చరణ్, తమిళ దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ చేంజర్'. దిల్‌రాజు, శిరీష్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని అనౌన్స్ చేసిన రోజు నుంచే భారీ అంచనాలు ఏర్పడి, రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఈ సినిమాను ఎప్పుడెప్పుడు చూస్తామా అనే ఆసక్తి చాలా మందిలో ఉంది. ప్రపంచ వ్యాప్తంగా రామ్‌చరణ్‌కు ఉన్న క్రేజ్‌ని దృష్టిలో పెట్టుకుని గేమ్ ఛేంజర్ చిత్రాన్ని రూపొందిస్తున్నారు దర్శకనిర్మాతలు. బుధవారం రామ్‌చరణ్ పుట్టిన రోజు కావడంతో ఈ సినిమా నుంచి 'జరగండి' అనే పాటను విడుదల చేస్తున్నారు. 150 థియేటర్లలో ఈ పాటను ప్రత్యేకంగా ప్రదర్శిస్తుండడం విశేషం. సంగీత దర్శకుడు తమన్ ఈ సినిమాకు సంగీత దర్శకత్వం వహిస్తున్నారు. కియారా అద్వాణి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీకాంత్, ఎస్.జె.సూర్య, సునీల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. కార్తిక్ సుబ్బరాజు అందించిన కథకు సాయిమాధవ్ బుర్రా మాటలు రాశారు. తిరుణ్ణావుక్కరసు ఛాయాగ్రాహకుడు.

రాముడి కోసం రెడీ అవుతున్న రణ్‌బీర్



బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడి పాత్ర కోసం మానసికంగా, శారీరకంగా సిద్ధమవుతున్నారు. శ్రీరాముడు బాణం వేసి శత్రువుల్ని మట్టుపెట్టడంలో ఆరితేరిన వ్యక్తి కనుక రణ్‌బీర్ ఇప్పుడు విలువిద్య మీద దృష్టి పెట్టారు. విలువిద్యలో ఆయన శిక్షణ పొందుతున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అలాగే శారీరకంగా మరింత ధృడంగా కనిపించడం కోసం ఎక్కువ సమయం జిమ్‌లోనే గడుపుతున్నారు. 'రామాయణ్' షూటింగ్ ఎప్పుడు మొదలవుతుంది, ఎవరెవరు ఏ ఏ పాత్రలు పోషిస్తున్నారనే అధికారిక సమాచారాన్ని శ్రీరామ నవమి సందర్భంగా ఏప్రిల్ 17న దర్శకుడు నితిశ్ తివారి వెల్లడించనున్నారు. ఒక అద్భుతమైన దృశ్య కావ్యంగా ఈ చిత్రాన్ని రూపొందించడం కోసం నితిశ్, ఆయన టీమ్ ఐదేళ్లుగా ప్రీ ప్రొడక్షన్ వర్క్ చేస్తోంది. ఎటువంటి విమర్శలకు తావు లేకుండా స్క్రిప్ట్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అలాగే విజువల్ ఎఫెక్ట్ అత్యద్భుతంగా ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. సీతగా సాయిపల్లవి, రావణునిగా యశ్ నటించే 'రామాయణ్' చిత్రం 2025 దీపావళికి విడుదల అవుతుంది.

హాట్‌గా కనిపించడం కష్టమే!



'ప్రేమం'తో కుర్రకారు మతిపోగొట్టి.. గర్ల్ నెక్స్ డోర్ పాత్రలతో మెప్పించారు క్యూట్ బ్యూటీ అనుపమా పరమేశ్వరన్. ప్రస్తుతం ఆమె 'టిల్లు స్క్వేర్' చిత్రంలో హాట్‌హాట్‌గా కనిపించడం టాక్ ఆఫ్ ది టౌన్ అయ్యింది. ఈ నెల 29న ఈ చిత్రం విడుదలవుతున్న సందర్భంగా ఆమె ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో లిల్లీ పాత్ర గురించి మాట్లాడారు. లిల్లీ పాత్రలో చాలా లేయర్స్ ఉంటాయి. ఈ సినిమాలో నేను వేసుకున్న డ్రెస్సులు రియల్ లైఫ్‌లో అస్సలు వేసుకోలేను. స్క్రీన్‌పైన హాట్‌గా కనిపించాలంటే ఎంత కష్టమో ఈ చిత్రంతోనే తెలిసొచ్చింది. ఇప్పటివరకూ పక్కింటి అమ్మాయి పాత్రలు చేసే నేను ఒక్కసారిగా ఇలా గ్లామరస్ రోల్ చేయడంతో చాలా మంది ఆశ్చర్యపోయారు. ఇప్పటివరకూ ఇలాంటి రోల్స్ చేసిన హీరోయిన్స్‌ను మెచ్చుకోవాల్సిందే" అని చెప్పారు.

పిల్లల్ని ఎలా పెంచాలో చూపించాం



'అల్లంత దూరాన', 'కళా పోషకులు', 'జై సేన' వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకులకు చేరువయ్యారు యంగ్ హీరో విశ్వ కార్తికేయ. ప్రస్తుతం ఆయన నటించిన 'కలియుగం పట్టణంలో' చిత్రం ఈ నెల 29న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా విశ్వ కార్తికేయ, మంగళవారం మీడియాతో ఈ చిత్రం గురించి పలు ఆసక్తికర విశేషాలను పంచుకున్నారు.

"ప్రతీ ఒక్కరిలో వివిధ రకాల షేడ్స్ ఉంటాయి. వాటిని చూపించేలా ఈ చిత్రం ఉంటుంది. ఛాలెంజింగ్ రోల్స్ చేయాలని అనుకుంటున్న సమయంలోనే నేను ఈ కథ విన్నాను. దర్శకుడు రమాకాంత్ రెడ్డి ఈ కథ చెప్పిన విధానానికి ఆశ్చర్యపోయాను. క్లైమాక్స్ వరకు ఏం జరుగుతుందో కనిపెట్టలేకపోయాను. ఈ సినిమాలో ప్రతీ పాత్రను దర్శకుడు చక్కగా మలిచారు. ఈ చిత్రం సస్పెన్స్ థ్రిల్లర్. ఇందులో ఉన్న మదర్ సెంటిమెంట్ ప్రేక్షకుల్ని భావోద్వేగానికి గురిచేస్తుంది. ఈ చిత్రం నా కెరీర్‌లోనే ఎంతో ప్రత్యేకంగా నిలుస్తుంది. ఈ సినిమాలో సమాజంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులు, పిల్లల్ని తల్లిదండ్రులు సరిగ్గా పెంచకపోతే ఎలా ఉంటుందో చూపించాం" అని చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Ki0UPLq లో చదవండి.





దిక్సూచి DIKSUCHI

పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్

కోడింగ్ డీకోడింగ్

1. ఒక సంకేత భాషలో LOVEను DTLHగా రాసిన అదే సంకేత భాషలో PONDను ఏ విధంగా రాస్తారు?

ఎ) LCLL బి) CLLL

సి) LLLC డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ:

12 15 22 5 — 4 20 12 8

L O V E - D T L H

(-1, -2, -3, -4)

ఇదే విధంగా

16 15 14 4 — 3 12 12 12

P O N D - C L L L

(-1, -2, -3, -4)

గా రాస్తారు.

గమనిక:- పై వివరణ పరిశీలిస్తే LOVE అనే పదంలో చివరి అక్షరం E నుంచి మొదటి అక్షరం L వరకు (చివరి నుంచి మొదటికి) -1, -2, -3 -4 అనే క్రమపద్ధతిలో కోడ్ చేశారని తెలుస్తున్నది.)

2. ఒక కోడ్ భాషలో ROUNDను NODRUగా రాసిన అదే కోడ్ భాషలో READYను ఏ విధంగా రాస్తారు?

ఎ) DEYAR బి) DEYRA

సి) YADER డి) EDRAY

సమాధానం: (బి)

వివరణ: ROUND అనే పదంలోని అక్షరాల స్థానాలు మారాయి. (జంబ్లింగ్ అయినవి) పదంలోని అక్షరాలపై వరుస సంఖ్యలను రాసుకొని ఏ విధంగా స్థానాలు మారాయో గమనించి అదే పదతిలో మార్చి రాయాలి.

1 2 3 4 5 — 4 2 5 1 3

R O U N D — N O D R U

ఇదే విధంగా

1 2 3 4 5 — 4 2 5 1 3

R E A D Y — D E Y R Aగా రాస్తారు.

3. ఒక కోడ్ భాషలో PONDను QRFPగా రాస్తే అదే కోడ్ భాషలో IDEAను ఏ విధంగా రాస్తారు?

ఎ) FKCG బి) FCGK

సి) CFKG డి) FGKC

సమాధానం: (ఎ)

వివరణ: POND అనే పదంలోని అక్షరాలను +2 చేయగా RQPF. ఇప్పుడు దీనిలోని ప్రతి రెండు అక్షరాలు తిప్పిరాయగా QRFPగా కోడ్ చేశారు. అదే విధంగా IDEA అనే పదంలోని అక్షరాలను +2 చేయగా KFGC. ఇప్పుడు దీనిలోని ప్రతి రెండు అక్షరాలను తిప్పి రాయగా FKCG సమాధానం అవుతుంది.


16 15 14 4 — P O N D — (+2 +2 +2 +2) — Q R F P — 17 18 6 16

ఇదే విధంగా

9 4 5 1 — I D E A — (+2 +2 +2 +2) — F K C G — 6 11 3 7

గా రాస్తారు.

గమనిక: పదాలను పైన, కింద ఇచ్చిన అంకెలను పరిశీలిస్తే క్రాస్‌గా +2 పద్ధతిని అనుసరించిందని తెలుస్తోంది.



4. ఒక కోడ్ భాషలో JOKEను NIDJగా రాసిన అదే కోడ్ భాషలో NIKEను ఏ విధంగా రాస్తారు?

ఎ) HMJD బి)MDJH సి) HMDJ డి) JODL

సమాధానం: (సి)

వివరణ:

10 15 11 5 — J O K E — (-1 -1 -1 -1) — N I D J — 14 9 4 10

ఇదే విధంగా

14 9 11 5 — N I K E — (-1 -1 -1 -1) — H M D J — 8 13 4 10

గా రాస్తారు.

గమనిక: పదాలకు పైన, కింద ఇచ్చిన సంఖ్యలను పరిశీలిస్తే క్రాస్‌గా -1 పద్ధతిని అనుసరిస్తున్నదని తెలుస్తున్నది.

5. ఒక కోడ్ భాషలో POLICEను NQRGEKగా రాశారు. అదే కోడ్ భాషలో ORANGE ఏ విధంగా రాస్తారు?

ఎ) CTQGIP బి) CQTPIG

సి) QTCPIG డి) CTGQPI

సమాధానం: (ఎ)

వివరణ: POLICE అనే పదంలోని అక్షరాలను +2 చేయగా RQNKEG ఇప్పుడు మొదటి సగం అక్షరాలను, రెండో సగం అక్షరాలను అవే స్థానాలలో తిప్పి రాయగా NQRGEK. అదేవిధంగా ORANGE అనే పదంలోని అక్షరాలను +2 చేయగా QTCPIG ఇప్పుడు మొదటి సగం అక్షరాలను, రెండో సగం అక్షరాలను అవే స్థానాలలో తిప్పి రాయగా CTQGIP సమాధానం అవుతుంది.

16 15 12 9 3 5 — P O L I C E — (+2 +2 +2 +2 +2 +2) — N Q R G E K — 14 17 18 7 5 11

ఇదే విధంగా

15 18 1 14 7 5 — O R A N G E — (+2 +2 +2 +2 +2 +2) — C T Q G I P — 3 20 17 7 9 16

గా రాస్తారు.

గమనిక: పదాలకు పైన, కింద ఇచ్చిన అంకెలను గీతల ఆధారంగా జాగ్రత్తగా పరిశీలిస్తే +2 పద్ధతిని అనుసరించిందని తెలుస్తోంది.

6. ఒక కోడ్ భాషలో FAMOUSను PWVGCPగా రాశారు. అదే కోడ్ భాషలో MOBILEను ఏవిధంగా రాస్తారు?

ఎ) JHQNNE బి) QJENNH

సి) JNHNQE డి) JNNHEQ

సమాధానం: (సి)

వివరణ:

F A M O U S — (+1 +2 +3 +1 +2 +3) — P W V G C P — 16 23 22 7 2 16

ఇదే విధంగా

M O B I L E — (+1 +2 +3 +1 +2 +3) — J N H N Q E — 10 14 8 14 17 5

గా రాస్తారు.

జాగ్రత్తగా క్రాస్‌లైన్ గమనించండి. క్రాస్‌లైన్‌కు పైన, కింద ఇచ్చిన సంఖ్యలు +1, +2, +3, +1, +2, +3లో ఉన్నాయి. (లేదా)

FAMOUS అనే పదంలోని అక్షరాలను ముందుగా +1, +2, +3, +1, +2, +3గా రాయగా GCPPWV అవుతుంది. దీనిలో ఎడమవైపు అర్ధభాగంలోని అక్షరాలను (GCP) కుడివైపు అర్ధభాగంలో, కుడివైపు అర్ధభాగంలోని అక్షరాలను (PWV)ఎడమవైపు అర్ధభాగంలో రాయగా PWVGCP అవుతుంది. ఇదేవిధంగా పదం MOBILEలోని అక్షరాలను +1, +2, +3, +1, +2, +3లో రాయగా NQEJNH దీనిలో ఎడమవైపు అర్ధభాగంలోని అక్షరాలు (NQE) కుడివైపు అర్ధభాగంలో, కుడివైపు అర్ధభాగంలోని అక్షరాలు (JNH) ఎడమ వైపు అర్ధభాగంలో రాయగా JNHNQE సమాధానం అవుతుంది.

7. ఒక కోడ్ భాషలో MISTAKEను SAMKIETగా రాస్తే అదే కోడ్ భాషలో PRIVATEను ఏవిధంగా రాస్తారు?

ఎ) IAPTREV బి) APTIRVE

సి) IAPRTVE డి) IATPREV

సమాధానం: (ఎ)

వివరణ: MISTAKE అనే పదంలోని అక్షరాల స్థానాలు మారాయి. (జంబ్లింగ్ అయినవి) పదంలోని అక్షరాలపై వరుస సంఖ్యలను రాసుకొని ఏ విధంగా స్థానాలు మారాయో గమనించి అదే పద్ధతిలో మార్చి రాయాలి.

1 2 3 4 5 6 7 — 3 5 1 6 2 7 4

M I S T A K E — S A M K I E T

ఇదే విధంగా

1 2 3 4 5 6 7 — 3 5 1 6 2 7 4

P R I V A T E — I A P T R E V

గా రాస్తారు.

8. ఒక కోడ్ భాషలో POLICEను ECILOPగా రాస్తే అదే కోడ్ భాషలో CINEMAను ఏవిధంగా రాస్తారు?

ఎ) AMENIC బి) NEACIM

సి) AMNIEC డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: POLICE అనే పదంలోని అన్ని అక్షరాలను తిప్పిరాయగా ECILOP. అదే విధంగా CINEMA అనే పదంలోని అన్ని అక్షరాలను తిప్పి రాయగా AMENIC సమాధానం అవుతుంది.

9. ఒక కోడ్ భాషలో LONGERను OLGNREగా రాశారు. అయితే అదే కోడ్ భాషలో NATIVEను ఏవిధంగా రాస్తారు?

ఎ) ANTIEV బి) NATVEI

సి) ANITEV డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ: LONGER అనే పదంలో మొదటి రెండు అక్షరాలు తిప్పిరాయగా OL, తదుపరి 3, 4 అక్షరాలు తిప్పిరాయగా GN, ఆ తరవాత చివరి రెండు అక్షరాలు తిప్పిరాయగా RE అనగా పదంలో ప్రతి రెండు అక్షరాలు తిప్పి రాయడమైనది. ఈ విధంగా LONGER అనే పదం OLGNREగా మారింది. ఇదే విధంగా NATIVE అనే పదంలో మొదటి రెండు అక్షరాలు తిప్పిరాయగా AN, తదుపరి 3, 4 అక్షరాలు తిప్పిరాయగా IT. ఆ తరవాత చివరి రెండు అక్షరాలు తిప్పిరాయగా EV, కావున సమాధానం ANITEV అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్, సీనియర్ ఫ్యాకల్టీ

జిప్‌మ్యాట్

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)- 'జాయింట్ ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్ (జిప్‌మ్యాట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా ఐఐఎం బోధ్ గయ, ఐఐఎం జమ్మూ ఉమ్మడిగా అందిస్తున్న ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (ఐపీఎం)లో ప్రవేశాలు కల్పిస్తారు. దీని వ్యవధి అయిదేళ్లు. ఇందులో లాంగ్వేజ్ స్కిల్స్, ఓరల్ కమ్యూనికేషన్ స్కిల్స్, మేనేజ్‌మెంట్ స్టడీస్‌కు సంబంధించిన ఫౌండేషనల్ సబ్జెక్టులు, ఎథికల్ అండర్‌స్టాండింగ్ అంశాలు బోధిస్తారు.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఆర్ట్స్/కామర్స్/సైన్స్ గ్రూపులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి.

జిప్‌మ్యాట్ వివరాలు: దీనిని సీబీటీ(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 33, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 33, వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్ నుంచి 34 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.2000; ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 21
- **జిప్‌మ్యాట్ 2024 తేదీ:** జూన్ 6
- **వెబ్‌సైట్:** https://exams.nta.ac.in/JIP-MAT/

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/eTGmYu6లో చదవండి.



చంద్రబాబు పర్యటనలో మార్పులు

రేపల్లె, మార్చి 26: ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 31వతేదీ రేపల్లె పట్టణంలో ఎన్టీఆర్ సర్కిల్ వద్ద బహిరంగ సభలో పాల్గొంటారని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఒంగోలు నుంచి హెలికాప్టర్‌లో పెనుమూడి సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగి ర్యాలీగా పట్టణంలోకి వచ్చి ఎన్టీఆర్ సర్కిల్ వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సభలో పాల్గొని విజయవంతం చెయ్యాలని ఆయన కోరారు.

సీఐ చిన్న మల్లయ్యపై చర్యలు తీసుకోవాలి

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు

నరసరావుపేట టౌన్, మార్చి26: వైసీపీ తొత్తులా వ్యవహరిస్తున్న సీఐ చిన్నమల్లయ్యపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కారంపూడి కొత్త బస్టాండ్ వద్ద టీస్టాల్‌లో టీడీపీ నాయకులు టీ తాగుతుండగా సీఐ చినమల్లయ్య జీపులో రౌండ్లు వేసినేరుగా టీ స్టాల్ వద్దకు వచ్చి ఎవడ్రా వీరిని ఇక్కడ కూర్చోబెట్టింది అని బెదిరించారని అన్నారు. అంతటితో ఆగకుండా టీడీపీ నాయకులపై దౌర్జన్యం చేస్తూ ఇక్కడి నుంచి వెళ్ళిపోండి అంటూ నోటి కొచ్చినట్లు బూతులు తిడుతూ, ఇదేమిటని ప్రశ్నించిన మాజీ మండల పార్టీ అధ్యక్షుడు చప్పిడి రాముపై విరుచుకుపడటం అత్యంత దారుణం అన్నారు. నన్ను ప్రశ్నిస్తారా అంటూ అక్కడ ఉన్న టీడీపీ శ్రేణులలో ఒకరైన దివ్యాంగుడును లాటితో కొడుతూ వీరంగం చేసి చప్పిడి రాముని పదరా స్టేషన్‌కు అంటూ పబ్లిక్‌లో లాటితో నెట్టడంతో ప్రశ్నించిన టీడీపీ శ్రేణులపై తుపాకీ తీసి కాల్చి వేస్తామంటూ వీరంగం చేసి భయంకర వాతావరణాన్ని సృష్టించారన్నారు. టీడీపీ నాయకులను కాల్చమని సీఐ చినమల్లయ్యకి ఎవరు ఆదేశించారో బహిరంగంగా చెప్పాలని డిమాండ్ చేశారు. తగిన విచారణ చేసి వెంటనే సస్పెండ్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిరాధార ఆరోపణలు చేసిన వారిపై పరువు నష్టం దావా వేస్తా

● నరసరావుపేట ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయలు



క్రోసూరులో మాట్లాడుతున్న ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు

క్రోసూరు, మార్చి 26 : విశాఖపట్నం డ్రగ్స్ కేసులో తనపై నిరాధార ఆరోపణలు చేసిన వారిపై పరువు నష్టం దేవా వేయనున్నట్టు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు చెప్పారు. మంగళవారం క్రోసూరులో ఆయన మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎప్పుడో కొన్ని సంవత్సరాల క్రితం ఏదో కంపెనీలో డైరెక్టర్ తనతో ఫొటో తీయించుకున్నాడని, దానిని పట్టుకొని తనపై అదే పనిగా ఆరోపణలు చేయటం శోచనీయం అన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ వారే ఇంతవరకు ఈ కేసులో నిందితుల పేర్లు వెల్లడించలేదని, కొంతమంది వ్యక్తులు పని గట్టుకొని బురదజల్లే కార్యక్రమం చేపట్టారన్నారు. ఈ విషయమై ఇప్పటికే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని, త్వరలో పరువునష్టం దావా కూడా వేయనున్నామన్నారు. బీసీలపై ప్రేమ ఉంటే ఇక్కడ ఎంపీ సీటు ఇచ్చిన వ్యక్తిని మంత్రి వర్గం నుంచి ఎందుకు తొలగించాల్సి వచ్చిందో చెప్పాలన్నారు. గడిచిన ఐదు సంవత్సరాల్లో పల్నాడు జిల్లాలో అభివృద్ధే ధ్యేయంగా పని చేశానని, మళ్ళీ ప్రజలు అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి సాధిస్తానని ఆయన తెలిపారు. ఐదు వందల కోట్ల రూపాయల కేంద్ర ప్రభుత్వ నిధులతో జల జీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇచ్చే కార్యక్రమం చేపట్టామన్నారు. వరికలపుడిసెల ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయనున్నట్టు తెలిపారు. పెదకూరపాడు నియోజకవర్గంలో మూడు వందల కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తాననని ఆయన హామీ ఇచ్చారు. పల్నాడు జిల్లాలో సాగు నీరు, తాగునీటిపై ప్రధాన దృష్టి సారిస్తానని ఆయన తెలిపారు. సమావేశంలో పెదకూరపాడు నియోజక వర్గ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి బాష్యం ప్రవీణ్, ఇంకా పలువురు నాయకులు పాల్గొన్నారు.

అవ్వా, తాతలకు తిప్పలే

ఏప్రిల్ 3 తర్వాతే సామాజిక పింఛన్లు ● వరుస సెలవులంటూ ప్రభుత్వ ప్రకటన ● ఉన్న నిధులు కాంట్రాక్టర్లకు చెల్లింపులు

గుంటూరు సిటీ, మార్చి 26: ఐదేళ్ళ పాలనలో అన్నివర్గాలను ఇబ్బందుల పాలు చేసిన జగన్ ప్రభుత్వంలో ఇప్పుడు అవ్వా, తాతల వంతు వచ్చింది. ఏప్రిల్ మాస పింఛన్లకు బ్రేకు పడింది. ఏప్రిల్ 3 తర్వాత వైఎస్సార్ పెన్షన్ కానుక అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వరుసగా సెలవులు వచ్చినందువల్ల ఈ నిర్ణయం తీసుకున్నామని ప్రభుత్వం చెబుతోంది. ఫలితంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో 7.80 లక్షల మంది వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. వాస్తవానికి వీరిలో చాలామంది ఈ పెన్షన్ మీదే ఆధారపడి బతుకుతున్నారు. పిల్లల నిరాదరణకు గురైన వృద్ధులు పెన్షన్‌తోనే మందు మాకు కొనుక్కొని, పొట్టపోసుకొని బతుకుతున్నారు. గత కొద్ది నెలలుగా ప్రభుత్వం ఇలా ఏదో ఒక సాకు చెబుతూ సామాజిక పెన్షన్లు పంపిణీలో ఆలస్యం చేస్తుంది. వాస్తవానికి శుక్రవారం గుడ్‌ఫ్రైడే కావడంతో బ్యాంక్‌లకు సెలవు ఉంది. శనివారం బ్యాంక్‌లు యథావిధిగానే పనిచేస్తాయి. ప్రభుత్వం సామాజిక పెన్షన్లు పంచాలన్న ఆలోచన ఉంటే శనివారం నిధులు డ్రా చేసి, సోమవారం పంపిణీ చేయించవచ్చు. గతంలో నెల చివరి రోజు నిధులు డ్రా చేయించి పంచాయతీ కార్యదర్శికి అందజేసేవారు. పంచాయతీ కార్యదర్శి 1 వ తేదీన వాటిని వలంటీర్లకు అందజేసి అదే రోజు పంపిణీ చేయించే వారు. ఇప్పుడు మాత్రం ప్రభుత్వం సోమవారం బ్యాంక్‌లకు సెలవు కావటం వలన పెన్షన్లు ఆలస్యం అవుతున్నట్టు చెబుతోంది. ఒక వేళ అదే నిజం అనుకున్నా మరి మంగళవారం బ్యాంకులు మామూలు గానే పనిచేసే అవకాశం ఉంది. ఆరోజు నిధులు డ్రా చేసి పంపిణీ చేసే అవకాశం కూడా ఉంది. అయినా ఏప్రిల్ 3 తర్వాతే పెన్షన్లు ఇస్తామంటూ ప్రభుత్వం చెబుతుండటం గమనార్హం.

పెద్దల కాసుల కక్కుర్తితో...

ప్రభుత్వ గడువు దగ్గర పడి, ఎన్నికలు సమీపిస్తుండటంతో ఉన్న నిధులను పార్టీ అనుకూల కాంట్రాక్టర్లకు చెల్లిస్తున్న నేపథ్యంలో సామాజిక పెన్షన్ల పంపిణీకి ఆలస్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. జిల్లా ఖజానా కార్యాలయాల్లో వైసీపీ అనుకూల కాంట్రాక్టర్లకు మాత్రమే బిల్లుల చెల్లింపులో పెద్దపీట వేయాలని ప్రభుత్వ పెద్ద ల నుంచి ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం వస్తుందో.. రాదో అన్న అనుమానంతో ఉన్న బడా కాంట్రాక్టర్లు పెద్ద మొత్తంలో పర్సెంటేజీలు చెల్లించి బిల్లుల చెల్లింపుకు గ్రీన్ సిగ్నల్ తెచ్చుకుంటున్నారు. ఈ దొడ్డి దారి చెల్లింపులకే నిధులు సరిపోవటంతో సామాజిక పెన్షన్లు కూడా ఆపేందుకు జగన్ ప్రభుత్వం వెనుకాడటం లేదు. ప్రభుత్వ పెద్దల కాసుల కక్కుర్తికి గుంటూరు జిల్లాలో 2,61,598 మంది, పల్నాడు జిల్లాలో 2,83,119 మంది, బాపట్ల జిల్లా లో 2,35,791 మంది సామాజిక పెన్షన్ దారులు ఇబ్బందులు పడనున్నారు.

ఉద్యోగులకూ అదే పరిస్థితి..

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన బిల్లులు ఏప్రిల్ 1 తరువాతే అనుమతించాలని ఇప్పటికే ఉత్తర్వులు వెలువడ్డాయి. 1 వ తేదీ తర్వాత బిల్లులు పెడితే జీతాలు పడే సమయానికి నెల చివరి వారం అవుతుందని ఉద్యోగులు బహిరంగంగా నే సనుగుతున్నారు. ఉపాధ్యాయుల జీతాలు మరీ ఆలస్యం అవుతోంది అని చెబుతున్నారు. ఇప్పుడు సామాజిక పెన్షనర్లను కూడా ప్రభుత్వం వెతలకు గురిచేస్తుండటం పట్ల నిరసన వ్యక్తం అవుతోంది.

మైనింగ్ అక్రమాలను అరికడతాం : పెమ్మసాని



పెమ్మసాని, నరేంద్రకుమార్‌ను గజ మాలతో సత్కరిస్తున్న సుద్ధపల్లి వాసులు

చేబ్రోలు, మార్చి 26: చేబ్రోలు మండలంలో అక్రమ మైనింగ్‌ను పూర్తిగా అరికడతామన్ని కూటమి అభ్యర్థులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌లు ప్రజలకు హామీ ఇచ్చారు. మంగళవారం మండలంలోని సుద్ధపల్లి, శెలపాడు, శేకూరు, వడ్లమూడి గ్రామాల్లో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో రోడ్ షో జరిగింది. ఈ సందర్భంగా గ్రామాలకు విచ్చేసిన డాక్టర్ పెమ్మసాని, నరేంద్ర కుమార్, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబుకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. మహిళలు మంగళహారతులు ఇచ్చి గ్రామంలోని తోడ్కొని వెళ్లారు. పలు గ్రామాల కూడలలో డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ ప్రజలు వైసీపీని నమ్మి అధికారం అప్పగిస్తే చేబ్రోలు మండలంలో 700 ఎకరాల పంట భూములను కనుమరుగు చేసి అక్రమ మైనింగ్ ద్వారా వందల కోట్లు సంపాదించారన్ని ఆరోపించారు. అక్రమ మైనింగ్‌తో పంటలు దెబ్బతిన్ని రైతులు తీవ్ర ఇబ్బందులో ఉన్నారన్నారు. తన ఉన్నతి కారణమైన ప్రజలు కష్టాల్లో ఉంటే వాల కన్నీరు తుడవటానికి గుంటూరు ఎంపీగా పోటీ చేయటానికి ముందుకు వచ్చిన్నట్లు చంద్రశేఖర్ చెప్పారు. నరేంద్ర కుమార్ మట్లాడుతూ శేకూరు గ్రామంలో అక్రమ మైనింగ్ జరగనీయబోనన్ని హామీ ఇచ్చారు. ఉందని అహంకారంతో దోపిడీదారులు ఇంకా మైనింగ్ చేయటం దారుణం అన్నారు. ఇప్పటికే అక్రమ మైనింగ్‌తో గ్రామాలు ధ్వంసం అయ్యాయన్ని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజులలో వైసీపీ నాయకుల విధ్వంసాన్ని ఆపుతామన్ని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి కూటమి అభ్యర్థులైన పెమ్మసాని చంద్రశేఖర్‌ను, తనను గెలిపించాలన్ని నరేంద్ర కుమార్ విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కూలీల ఆటో

● 9మందికి తీవ్ర గాయాలు
● చికిత్స పొందుతూ ఒకరు మృతి



సంఘటనా స్థలంలో పడి ఉన్న క్షతగాత్రులు, క్షతగాత్రులను ఎస్ఐ సొంత వాహనంలో తీసుకెళ్తున్న దృశ్యం

పెదనందిపాడు, మార్చి 26: స్థానిక పెదనందిపాడు - చిలకలూరిపేట ప్రధాన రహదారిలో కోల్డ్‌స్టోరేజీల సమీపంలో మంగళవారం ట్రాక్టర్, కూలీల ఆటో ఢీకొని తొమ్మిదిమందికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం కాకుమాను మండలం పెద్దివారిపాలేనికి చెందిన శ్రీనివాసరావు ట్రాక్టర్‌పై శెనగల లోడుతో కోల్డ్‌స్టోరేజీకి వెళ్తుండగా అప్పాపురం గ్రామానికి చెందిన 15 మంది మహిళా కూలీలు పొలం పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామం వెళ్తున్నారు. కోల్డ్ స్టోరేజీ సమీపంలో ఎదురుగా వస్తున్న టాక్టర్‌ను ఢీకొనడంతో ఆటో బోల్తా కొట్టింది. దీంతో ఆటోలో ఉన్న 8మందికి కూలీలకు తీవ్రగాయాలయ్యాయి. వీరిలో పి.శరణ్యకు ఎడమ కాలు తెగి వేరుపడింది. మరో ఇద్దరికి బలంగా గాయాలయ్యాయి. మరికొంతమందికి తలకు, ఛాతికి గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. ఎంతసేపటికి రాకపోవడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ రాజ్‌కుమార్, పోలీసు సిబ్బంది తమ సొంత వాహనాల్లో కొంత మంది క్షతగాత్రులను పెదనందిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కొంతమందిని మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మల్లెల వెంకాయమ్మ అనే మహిళ చికిత్స పొందుతూ మృతిచెందింది. సంఘటపై ఎస్ఐ రాజ్‌కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో జగన్ దుర్మార్గపు పాలన పోవాలి

నిజం గెలవాలిలో నారా భువనేశ్వరి

ఏలూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దుర్మార్గపు పాలన పోయి చంద్రబాబు పాలన వచ్చేలా రానున్న ఎన్నికల్లో అందరూ సహకరించాలని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. అప్పుడే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక మరణించినవారి కుటుంబాలను పరామర్శించేందుకు ఆమె చేపట్టిన 'నిజం గెలవాలి' యాత్ర మంగళవా రం ఏలూరు జిల్లాలో కొనసాగింది. కొయ్యలగూడెం మండలం కన్నాయిగూడెంలో దిర్శిపోం వెంకటలక్ష్మి, ఎర్రంపేటలో చంద్ర చిన కన్నయ్య, జంగారెడ్డిగూడెం మండలం పేరంపేటలో భీమడోలు వెంకయ్య, జంగారెడ్డిగూడెంలో నల్లజర్ల కృష్ణ కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించారు. ఆ కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ అరాచకాల కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, అక్రమ కేసులతో చంద్రబాబు సహా అనేకమందిని జైలు పాల్జేశారని తెలిపారు. రాష్ట్రంలో ఎటు చూసినా అరాచకం రాజ్యమేలుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు మొదటి నుంచి ఒక శాశ్వత ప్రణాళికతో పనిచేసేవారన్నారు. బాబు హయాంలో పోలవరం ప్రాజక్టు నిర్మాణం 80 శాతం పూర్తయితే, గత ఐదేళ్లలో మిగతా పనులన్నీ పడకేశాయని దుయ్యబట్టారు. పట్టిసీమ ఎత్తిపోతల, రాయలసీమకు నీరందించే విషయంలోనూ ఆయన దూరదృష్టి పని చేసిందన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో ఎక్కడ చూసినా గంజాయి, మాదక ద్రవ్యాలు అందుబాటులో ఉండడం అత్యంత దారుణమన్నారు. ఆఖరుకు మహిళలకు గంజాయి అలవాటు చేసే దుర్భరపరిస్థితి అడుగడుగునా కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 33 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని, దీనికి కారణాలేమిటో ఆలోచిస్తేనే భయం వేస్తోందని చెప్పారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తెలుగుదేశాన్ని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

టీడీపీ నేత కంచేటి సాయి అరెస్టు



సత్తెనపల్లి పోలీసు స్టేషన్‌లో సాయి

సత్తెనపల్లి, మార్చి 26: పెదకూరపాడు నియోజక వర్గానికి చెందిన టీడీపీ నేత కంచేటి సాయిని అమరావతి పోలీసులు అరెస్టు చేసి మంగళవారం సత్తెనపల్లి కోర్టులో హాజరు పరిచారు. సాయి అమరావతి మండలంలోని ధరణికోటలో ఈ నెల 15న అధికార పార్టీ కార్యాలయానికి నిప్పుపెట్టిన కేసు లో నిందితుడు. సాయిని రెండు రోజుల క్రితమే ముంబైలో పోలీసులు అరె స్టు చేశారు. అక్కడి నుంచి కోర్టులో హాజరు పరిచేందుకు తీసుకువచ్చారు. సాయిని పోలీసులు తీసుకువచ్చారన్న సమాచారం తెలుసుకుని నాయకులు, కార్యకర్తలతో పాటు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బాష్యం ప్రవీణ్ సత్తెనపల్లి పోలీసుస్టేషన్ వద్దకు వచ్చారు. దీంతో పోలీసులు స్టేషన్ వద్ద ముందు జాగ్రత్తగా బందోబస్తు ఏర్పాటు చేశారు కంచేటి సాయికి సత్తెనపల్లి రెండో జూనియర్ సివిల్ జడ్జి 15 రోజుల రిమాండ్ విధించారు. సాయిని రిమాండ్‌కు తరలిస్తున్న సమయంలో కోర్టు ఆవరణలో కరెంటు కట్ చేయటంపై టీడీపీ నాయకులు నిరసన తెలిపా రు. వైసీపీ డౌన్‌డౌన్ అంటూ నినా దాలు చేశారు. అనంతరం భారీ పోలీసు బందోబస్తు మధ్య స్థానిక సబ్ జైలుకు సాయిని తరలించారు.

మిర్చియార్డులో ధరలు ఇలా...

గుంటూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,35,051 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,26,748 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 80,293 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈకింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	గరిష్ఠ ధర	కనిష్ఠ ధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	20000
నెంబరు. 5	8500	15500
273	9000	19000
341	9000	19500
4884	9500	17500
సూపర్ 10	8500	15000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	21500
బ్యాడిగి	9500	18000
దేవనూరు డీలక్స్	9000	16000
నాన్ ఏసీ తెల్లకాయలు	5000	12500

పోలీసుల అదుపులో అంతరాష్ట్ర దోపిడీ దొంగ!

పొన్నూరుటౌన్, మార్చి26: రెండు తెలుగు రాష్ట్రాల్లో తాళం వేసిన గృహాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగను పొన్నూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవల పట్టణంలోని విద్యానగర్‌లో ఓ ఇంట్లోకి చొరబడిన చోరీ చేయటం సీసీటీవీలో గుర్తించారు. అలాగే నేతాజీనగర్‌లో తాళం వేసిన ఇంట్లో చొరబడిన దొంగలు ఆ ఇంట్లో ఏమి లభించకపోవటంతో దుస్తులు, దుప్పట్లను తగులబెట్టి అరాచకానికి పాల్పడ్డారు. వరుస చోరీలకు పాల్పడుతున్న శ్రీనివాసరావు అనే వ్యక్తిని గుర్తించిన పోలీసులు రైల్వేస్టేషన్ వద్ద పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే ఈ నిందితుడిపై ఉభయ తెలుగురాష్ట్రాల్లో పలు చోరీ కేసులు నమోదైవుండటంతో రహస్య ప్రదేశానికి తరలించి విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

కోడ్ ఉల్లంఘించిన వైసీపీ నేతపై కేసు

గుంటూరు, మార్చి 26 : ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వైసీపీ నేతపై ఎన్నికల అధికారుల ఫిర్యాదు మేరకు గుంటూరు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసారు. పెదపలకలూరుకు చెందిన బాలస్వామి అనే వైసీపీ నాయకుడు కారులో వైసీపీ కండువాలు, కరపత్రాలతో వెళుతుండగా పలకలూరురోడ్డులోని కరెంట్ ఆఫీస్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీలలో ఇవి పట్టుబడ్డాయి. పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జ్ రత్నప్రసాద్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి. ఆయా సామగ్రి సీజ్ చేసి రత్నప్రసాద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

దంపతుల ఆత్మహత్యా యత్నం

● భర్త మృతి.. చికిత్స పొందుతున్న భార్య

కొల్లిపర, మార్చి 26: ఆర్థిక ఇబ్బందులు కారణంగా దంపతులు ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన మండలంలోని తూములూరులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం పద్మారావూరి చంద్రశేఖర్ (45), నాగలక్ష్మి (35)లు 25 ఏళ్లుగా దుగ్గిరాల మండలం ఈమనిలో ఉంటున్నారు. చంద్రశేఖర్ పదేళ్లుగా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గత సంవత్సరం ప్రమాదంలో చంద్రశేఖర్‌కు కాలికి తీవ్రగాయాలవ్వడంతో ఇంటికే పరిమితం కావాల్సి వచ్చింది. దీంతో ఆర్థిక సమస్యలు వెంటాడటంతో సోమవారం సొంత గ్రామమైన కొల్లిపర మండలం తూములూరుకు వచ్చారు. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక భార్యభర్తలు ఇరువురు సోమవారం పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు చంద్రశేఖర్‌ను, నాగలక్ష్మిని తెనాలి ప్రభు త్వ వైద్యశాలకు తరలించారు. మంగళవారం చంద్రశేఖర్ చికిత్స పొందుతూ మృతి చెందగా నాగలక్ష్మి చికిత్స పొందుతున్నట్లు ఎస్ఐ రవీంద్రరెడ్డి తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు : ఎమ్మెల్సీ జంగా

దాచేపల్లి, మార్చి 26: సోషల్ మీడియా, వివిధ పత్రికలలో తనపై వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి గురజాల నియోజకవర్గ నాయకులను, కార్యకర్తలను, అభిమానులను కోరారు. మంగళవారం పత్రికా ప్రకట నలో తెలియ జేస్తూ గురజాల నియోజకవర్గంలోని రాజకీయ అనిశ్చితిని ఆసరాగా చేసుకొని సోషల్ మీడియాలో, పలు పత్రికల్లో రకరకాల దుష్ప్రచారాలు వారి ఆలోచనలకు తగిన విధంగా నచ్చిన విధంగా ప్రచారం చేసుకుంటున్నారని జంగా ఆరోపించారు. నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సూచనలు, సలహాలు తీసుకొని వారి మనోభావాలకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటానని జంగా స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జంగా అనుయాయులు కొంతమంది మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా అయోమయంలో పడేసేందుకు కొంతమంది వ్యక్తులు చేస్తున్న కుట్రలో భాగమే ఇదని స్పష్టం చేశారు. ఒకటి రెండు రోజుల్లోనే జంగా రాజకీయ నిర్ణయాన్ని స్వయంగా తెలియజేస్తారన్నారు

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రెంటచింతల, మార్చి 26: జెట్టిపాలెం మోడల్ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసులు తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 28వ తేదీ నుంచి మే 22 తేదీ వరకు ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఎటువంటి రుసుం లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	121, 129,140
చికెన్ విత్ స్కిన్	228.00
చికెన్ స్కిన్ లెస్	238.00

వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు



పార్టీలో చేరిన వారితో బ్రహ్మారెడ్డి

వెల్దుర్తి, మార్చి 26: మండలంలోని వజ్రాలపాడుకు చెందిన 30 వైసీపీ కుటుంబాలు మంగళవారం ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. గ్రామానికి చేరుకున్న బ్రహ్మారెడ్డికి టీడీపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, మాజీ జడ్పీటీసీ కళ్లం రామాంజిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు పులుసు శివారెడ్డి, ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు వజ్రం నాయక్, లక్ష్మానాయక్, దిర్శినాల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

కారంపూడి, మార్చి 26: కారంపూడిలోని యానాది కాలనీ వైసీపీ నేతలు మంగళవారం ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. వెల్దుర్తిలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి వీరికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో అంజనేయులు, కృపారావు, నాగరాజు, ప్రభాకర్, మహేష్, శ్రీనివాసరావు, లక్ష్మయ్య, నానిబాబు, మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, నాగభూషణం, తేజ, పోలయ్య, మణికంఠ, వీరాంజనేయులు, కోటయ్య తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, మాజీ అధ్యక్షుడు బొల్నేడి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పంగులూరి అంజయ్య, పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, మాజీ అధ్యక్షుడు తండా మస్తాన్‌జాని, ఎస్టీసెల్ అధ్యక్షుడు బాలునాయక్, ఆర్యవైశ్య సంఘ నేతలు ఎస్‌పీఆర్ కృష్ణ, కాసుల శంకర్, బవిరిశెట్టి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

లావు, భాష్యం ఆధ్వర్యంలో చేరికలు



తమ్మవరంనకు చెందిన వైసీపీ నేతలకు టీడీపీ కండువాలు కప్పిన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, భాష్యం ప్రవీణ్ తదితరులు

పెదకూరపాడు, మార్చి 26 : వైసీపీ అవలంబిస్తున్న పలు ప్రజా వ్యతిరేక విధానాలతో విసుగు చెందిన ఎంతో మంది ఆ పార్టీకి చెందిన వారు తెలుగుదేశం పార్టీలోకి వస్తున్నారని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ అన్నారు. మండలంలోని తమ్మవరం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, భాష్యం ప్రవీణ్‌ల సమక్షంలో గుంటూరులోని కార్యాలయంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జగన్ ఒక్క ఛాన్స్ అంటూ రాష్ట్రాన్ని రాజధాని ప్రాంతవాసులమైన మమ్మల్ని మోసం చేశారని, మంచి చేస్తారని ఓట్లు వేస్తే తమను అవమానించారని వైసీపీ వారు వాపోయారు. ఎంపీగా శ్రీకృష్ణదేవరాయలను, ఎమ్మెల్యేగా నేను గెలిచిన తరువాత నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని, సమస్యలను పరిష్కరిస్తామని ప్రవీణ్ అన్నారు. కార్య క్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు వెన్నా సాంబశివారెడ్డి, డీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ వరప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

పెదకూరపాడు, మార్చి 26: పెదకూరపాడు నియోజకవర్గంలోని టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ జెండా మోస్తున్న ప్రతి కుటుంబానికి అండగా ఉంటామని మండల టీడీపీ అధ్యక్షుడు అర్తిమళ్ల రమేష్ అన్నారు. మండలంలోని పొడపాడులో అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త బాబావలి మృత దేహానికి టీడీపీ నేతలు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు, మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామగోపాలరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, మండల టీడీపీ నేతలు మద్దినేని వెంకట సత్యానారాయణ, షేక్ అజ్మల్లా, షేక్ నబీ సాహెబ్, కాసరబాద హనుమంతరావు, షేక్ మస్తాన్‌వలి, కఠారి శ్రీను, మౌలాలి, షేక్ ఆలీషా తదితరులు నివాళులర్పించారు. ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ మృతుని కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి తాను అండగా ఉంటానన్నారు.

కూటమి అభ్యర్థిని గెలిపిస్తేనే భవిష్యత్తు

● టీడీపీ సీనియర్ నేత యాగంటి మల్లికార్జునరావు



బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు

మాచర్లటౌన్, మార్చి 26: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డిని గెలిపిస్తేనే నియోజకవర్గ భవిష్యత్తు బాగుంటుందని టీడీపీ సీనియర్ నేత, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని మూడో వార్డులో జరిగిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీలో ఆయన పాల్గొని మాట్లాడారు. బ్రహ్మారెడ్డి గెలుపుతోనే నియోజకవర్గంలో అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఇంటింటికి తిరిగి ఉమ్మడి మ్యానిఫెస్టో సూపర్ 6 పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు యెనుముల కేశవరెడ్డి, కొమెర దుర్గారావు, జనసేన నేత నక్షత్రపు ప్రసాద్, వజ్రం నాయక్, తిక్కా కొండలు, బొట్టు కోటేశ్వరరావు, దుర్భాకుల ప్రసాద్, కొమెర శివ, కోటేశ్వరరావు, జానీబాషా, సంటోజు వేణు, బాదన్‌బాయి, మస్తాన్, భవాని, పేరువాల పుల్లారావు, మదీన్, శ్రీహరి, చందు తదితరులు పాల్గొన్నారు.

అర్చకులపై దాడికి ఖండన

సత్తెనపల్లి, మార్చి 26 : సమాజ శ్రేయస్సు, ప్రజల క్షేమం కోరే బ్రాహ్మణులు, అర్చకులపై వైసీపీ పాలనలో దాడులు, దౌర్జన్యాలు పెరిగాయని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాకినాడ శివాలయంలో అభిషేకం సరిగా చేయలేదని వైసీపీ నేత పూజారిపై దాడి చేయటం దుర్మార్గం అన్నారు. తక్షణమే ప్రభుత్వం అతనిపై చట్ట పరంగా కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు.

అమరావతి, మార్చి 26: కాకినాడ పెద్దశివాలయంలోని ఇద్దరు అర్చకులపై వైసీపీ నాయకుడు దాడి చేయడం అమానుషమని అది వైసీపీ పతనానికి నాంది అని అంతర్జాతీయ బ్రాహ్మణ సమాఖ్య దక్షిణ ప్రాంత మాజీ ఉపాధ్యక్షుడు పీసపాటి నాగేశ్వరశర్మ అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక బ్రాహ్మణులపై దాడులు పెరిగాయని అన్నారు. ఇలాంటి దాడులు మరలా జరుగకుండా బ్రాహ్మణులకు ప్రత్యేక రక్షణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సత్తెనపల్లి, మార్చి 26: కాకినాడ శివాలయంలో బ్రాహ్మణుల మీద జరిగిన దాడిని ఖండిస్తున్నట్టు బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య నాయకులు అన్నారు. మంగళవారం సత్తెనపల్లి బ్రాహ్మణ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నేతలు మాట్లాడుతూ దేవాలయాల్లో పని చేసే అర్చకులపై దాడులు చేయటం దుర్మార్గం అన్నారు. దాడి చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, బ్రాహ్మణులకు రక్షణ కల్పించాలని కోరారు.

దాచేపల్లి, మార్చి 26: నిత్యం పూజా కార్యక్రమాలతో స్వామివారి సేవలో తరించే బ్రాహ్మణులపై వైసీపీ నేతలు భౌతిక దాడులకు పాల్పడటం సభ్యసమాజానికి సిగ్గుచేటని దాచేపల్లి మండల బ్రాహ్మణ సంఘం నాయకులు ఆరోపించారు. మంగళవారం సంఘ సభ్యులు మాట్లాడుతూ కాకినాడలో పెద్దశివాలయంలో పూజారులుగా పనిచేస్తున్న వారిపై భౌతికదాడులకు పాల్పడటం సభ్యసమాజం తలవంచుకునేలా చేస్తుందని విమర్శించారు. దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎంపీ శ్రీ కృష్ణదేవరాయలు సుడిగాలి ప్రచారం

● అన్ని గ్రామాల్లో ఘన స్వాగతం

● పార్టీలో చేరిన ఊటుకూరు సర్పంచ్ దంపతులు



క్రోసూరులో పర్యటిస్తున్న ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు

క్రోసూరు, మార్చి 26 : నరసరావుపేట లావు శ్రీకృష్ణదేవరాయలు, పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి బాష్యం ప్రవీణ్ మంగళవారం క్రోసూరు మండలంలోని 15 గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అన్ని గ్రామాల్లోను ప్రజలు మేళతాళాలతో వారికి ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల పొలిమేరల నుంచి ఊరేగింపుగా వారిని గ్రామాల్లోకి తీసుకెళ్ళారు. గడిచిన ఐదు సంవత్సరాల్లో తాను చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను చూసి తనకు ఓటు వేయాలని ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ప్రజలను కోరారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో వ్యవస్థలన్నీ కుప్ప కూలిపోయాయని, అభివృద్ధి కుంటుపడిపోయిందని, ప్రస్తుత ప్రరిస్థితుల్లో రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వమే సరైనదన్న ఉద్దేశంతో టీడీపీలో చేరినట్టు తెలిపారు. శ్రీకృష్ణదేవరాయలు భాష్యం ప్రవీణ్‌తో కలసి బాలెమర్రు, అందుకూరు, క్రోసూరు, 88తాళ్ళూరు, గుడిపాడు, నాగవరం, హసానాబాద్, ఆవులవారిపాలెం, దొడ్లేరు, అనంతవరం, ఊటుకూరు గ్రామాల్లో పర్యటించారు. ఊటుకూరులో తెలుగు మహిళా అధికార ప్రతినిధి వేగుంటరాణి ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ గంజిమాల సుజాత దంపతులు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారి మెడలో టీడీపీ కండువాలు వేసి శ్రీకృష్ణదేవరాయలు పార్టీలోకి ఆహ్వానించారు. 88 తాళ్ళూరులో లక్ష్మీ తిరుపతమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవంలో వారు పాల్గొన్నారు. అనంతవరంలో శివాలయం, ఆంజనేయస్వామి ప్రతిష్ఠా మహోత్సవాల్లో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు వారికి ఆశీర్వచనాలు పలి కారు. వారి వెంట టీడీపీ నాయకులు గుడిపాడు బాషా, మన్నెం శ్రీనివాసరావు, నలజాల సదాశివరావు, వేగుంట రాణి, ఏపూరి నాగేశ్వరరావు, షేక్ బడా, తోకా వెంకటరావు, పిల్లకతుపుల రామయ్య, తాళ్ళూరి శ్రీనివాసరావు, దుద్దుల యోహాన్, బొబ్బా వెంకటేశ్వర్లు, బత్తుల హనుమంతరావు, విష్ణుమూర్తి, దుద్దుల యోహాన్, చిలకా కృష్ణారావు, చావా మురళీ, వాసిరెడ్డి వెంకటరావు, అనుమాల పూర్ణ పాల్గొన్నారు.

టీడీపీతోనే దళితుల అభ్యున్నతి : యరపతినేని



గాంధీనగర్‌లో మహిళలకు సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, మార్చి 26: రాష్ట్రంలో దళితుల సంక్షేమం, అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమవుతుందని గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం పిడుగురాళ్లలోని గాంధీనగర్‌లో సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ఇంటింటికి వెళ్లి గ్యారంటీ కార్డులను అందజేశారు. టీడీపీ పాలనలో దళితులకు ఉన్న 27 పథకాలను వైసీపీ ప్రభుత్వం వచ్చాక రద్దు చేసిందన్నారు. తల్లికి వందనం పేరుతో ప్రతి విద్యార్థికి ఏడాదికి 15 వేలు, ప్రతి మహిళకు నెలకు 1500 రూపాయలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు టీడీపీ అందిస్తున్న మూడు గ్యాస్ సిలిండర్లతో పాటు తాను ఒక సిలిండర్‌ను ఐదేళ్లలో ప్రతి కుటుంబానికి అందజేస్తామని ఆయన వివరించారు. అన్ని సామాజికవర్గాలు లబ్ధిపొందాలంటే టీడీపీ, జనసేన, భాజపా ఉమ్మడి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని యరపతినేని తెలిపారు. గాంధీనగర్‌లో ఇళ్లపట్టాలను గతంలో మంజూరు చేయించి ఇచ్చిన విషయాన్ని పలువురు మహిళలు యరపతినేనికి గుర్తుచేశారు. 22వ వార్డులోని గాంధీనగర్‌లో ప్రతి ఇంటికి, దుకాణాలకు వెళ్లిన యరపతినేనిని పలువురు ఆప్యాయంగా పలకరింపుతో పాటు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాండురంగ శ్రీను, కనిగిరి శ్రీను, పణితి రవి, పిల్లి చెన్నారావు, కాంతారావు, ఐతం మాణిక్యరావు, వడ్డవల్లి సర్వేశ్వరరావు, కోట హరి, వడ్డవల్లి సాంబశివరావు, కామిశెట్టి రమేష్, ఖాశింసైదా, ఆత్మకూరి కాశీవిశ్వనాథం, మునగా వెంకట్, పల్నూరి ధనుంజయ, వివి నాగేశ్వరరావు, సేగు రమేష్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దైదలో టీడీపీలో చేరిక

గురజాల మండలం దైద గ్రామానికి చెందిన రజక సామాజిక వర్గానికి చెందిన 15 కుటుంబాల వారు మంగళవారం రాత్రి పిడుగురాళ్లలో గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి యరపతినేని పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చాక కష్టపడిన ప్రతి కార్యకర్తను గుర్తుపెట్టుకుంటానని భరోసా ఇచ్చారు. బండి నాగేశ్వరరావు, నాగరాజు, పూర్ణ, కొండలు, శ్రీకాంత్‌తో పాటు పలువురు పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, కె.లక్ష్మయ్య, నరేష్, హనుమంతరావు, సాంబశివరావు, బుజ్జి, వెంకటేశ్వర్లు, కూరపాటి హనుమంతు పాల్గొన్నారు.

నేడు దాచేపల్లికి యరపతినేని రాక

దాచేపల్లి, మార్చి 26: గురజాల నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు బుధవారం దాచేపల్లిలోని పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. మంగళవారం పార్టీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ భద్రి మాట్లాడుతూ నారాయణపురంలోని సీపీఐ కల్యాణ మండపంలో టీడీపీ, జనసేన పార్టీ నాయకుల సమావేశం జరుగుతుందని వివరించారు. ఈ సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

తెలుగుదేశం పాలనలో ఎస్సీలకు అధిక ప్రాధాన్యం

● ఆత్మీయ సమ్మేళనంలో జూలకంటి బ్రహ్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

కారంపూడి, మార్చి 26: తెలుగుదేశం పార్టీ పాలనలోనే ఎస్సీలకు చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యం ఇచ్చారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి స్థానిక ఎస్సీ కాలనీలో జరిగిన మాల సామాజిక వర్గ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దళిత వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని వైసీపీ ప్రభుత్వం తుంగలో తొక్కి రాజారెడ్డి రాజ్యాన్ని అమలుపరుస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారన్నారు. ప్రస్తుతం మాచర్ల నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ లేదన్నారు. బ్రిటీష్ పాలన కంటే ఇప్పటి పరిపాలన ఘోరంగా ఉందన్నారు. పండుగ కానుకలు అందిస్తూ అన్ని మతాల వారిని సమానంగా చూసిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. పార్లమెంట్ స్పీకర్‌గా బాలయోగి, శాసనసభ స్పీకర్‌గా ప్రతిభాభారతి ఎంపికలతో చంద్రబాబు ఎస్సీలకు ఇస్తున్న ప్రాధాన్యత అర్థమవుతుందన్నారు. ప్రస్తుత పాలనలో ఓటర్లను భయాందోళనకు గురిచేసి పోలింగ్ అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని, ప్రతి ఓటరు స్వేచ్ఛగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డిని ఎస్సీ నేతలు జంగాప్రసాద్, మామిడి దురలు సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు పంగులూరి అంజయ్య, మాజీ అధ్యక్షుడు చప్పిడి రాము, పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, మాజీ ఎంపీపీ కొమెర లక్ష్మీనారాయణ, అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ యాదవ్, బీసీ సెల్ కన్వీనర్ గోరంట్ల నాగేశ్వరరావు, తెలుగు యువత అధ్యక్షుడు తుపాకుల చిన రత్తయ్య, పార్టీ సీనియర్ నేత కర్నా సైదారావు, ఎస్టీ సెల్ నేత బాలునాయక్, ఎస్సీ సెల్ నేత కాల్వ పేరయ్య, మాజీ సర్పంచ్ గుండా బ్రహ్మయ్య, తెలుగు మహిళ అధ్యక్షురాలు నాగలక్ష్మిరెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి శెట్టి హనుమంతురావు, జనసేన మండల అధ్యక్షుడు కేశానుపల్లి కృష్ణబాబు, తండా మస్తాన్‌జాని, బొల్నేడి హరికృష్ణ, మాజీ సర్పంచ్ దోర్నాల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మారెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం

● ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నేతలు

వెల్దుర్తి, మార్చి 26: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి మాచర్ల నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నేతలు అన్నారు. వెల్దుర్తిలోని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి స్వగృహంలో మంగళవారం బ్రహ్మారెడ్డిని కలిసి తమ మద్దతు ప్రకటించారు. తమ నేత మందా కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు కృషి చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాతులూరి కుమార్, ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డిపర్తి శ్రీనివాసరావు, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందుకూరి రమేష్, ఎంఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు మల్లయ్య, ఆదిరాల జక్రయ్య, తాళ్లూరి జీవరత్నం, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత కంచేటి సాయి అరెస్టు

● సత్తెనపల్లి పోలీసుస్టేషన్‌కు వెళ్ళిన అభిమానులు

క్రోసూరు, మార్చి 26 : పెదకూరపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకుడు కంచేటి సాయిని అరెస్టు చేసి మంగళవారం సత్తెనపల్లి కోర్టులో హాజరు పరిచారు. సోమవారం ముంబైలో అదుపులో తీసుకున్న కంచేటి సాయిని మంగళవారం సత్తెనపల్లికి తీసుకువచ్చారు. పెదకూరపాడు నియోజక వర్గం నుంచి వందలాది మంది టీడీపీ అభిమానులు, సాయి అభిమానులు సత్తెనపల్లికి తరలివెళ్ళారు. కంచేటి సాయికి ఏప్రిల్ 8వ తేదీ వరకు రిమాండ్ విధించినట్టు టీడీపీ నాయకులు తెలియ జేశారు. టీడీపీ నాయకులందరూ మూకుమ్మడిగా సత్తెనపల్లి పోలీసుస్టేషన్ వద్దకు చేరుకోవటం, కంచేటి సాయి రాక కోసం ఎదురు చూడటంతో పోలీసుస్టేషన్ వద్ద కొద్ది సేపు ఉద్రిక్తత నెలకుంది. సత్తెనపల్లి పోలీసుస్టేషన్‌లో పెదకూరపాడు నియోజక వర్గ టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్‌తో పాటు పలువురు టీడీపీ నాయకులు కంచేటి సాయిని కలసి ధైర్యం చెప్పారు.

కంచేటి సాయి అక్రమ అరెస్టుకు తీవ్ర ఖండన

బెల్లంకొండ, మార్చి 26: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కంచేటి సాయి అక్రమ అరెస్టుకు రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం బెల్లంకొండ పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పెదకూరపాడు నియోజకవర్గంలో విజయం సాధిస్తుందనే భయంతోనే సాయిని అక్రమంగా అరెస్టు చేశారని అన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ జ్యోతి సముద్రం, మండల టీసీ సెల్ అధ్యక్షుడు గుంజా గంగారావు, మాజీ సర్పంచ్ సయ్యద్ జానీ, పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాణ, అక్కల వెంకటరామిరెడ్డి, వెన్నా సీతారామిరెడ్డి, పీఎస్‌కే రసూల్, జబ్బార్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీల పథకాలను రద్దు చేసి మోసం చేసిన జగన్

సత్తెనపల్లి, మార్చి 26: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎస్సీల సంక్షేమ పథకాలను రద్దు చేసి ఎస్సీలను మోసం చేశాడని టీడీపీ ఎస్సీ సెల్ నేతలు అన్నారు. మంగళవారం సాయంత్రం టీడీపీ ప్రజా వేదికలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నేతలు మాట్లాడుతూ వైసీపీ నేతలు కొమ్మూరి కనకారావు, నందిగమ సురేష్ లాంటి నేతలకు మందా కృష్ణమాదిగను విమర్శించే స్థాయి లేదన్నారు. ఇద్దరు జాతి ప్రయోజనాలను గాలికి వదిలేసి జగన్ కోసం పాకులాడుతున్నారన్నారు. సమావేశంలో నాగరాజు, సురేష్‌కుమార్ తదితరులున్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కే అనీల్

సత్తెనపల్లి, మార్చి 26: బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కే అనీల్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ అధ్యక్ష పదవికి గంగూరి అజయ్ కుమార్, అనీల్ కుమార్‌లు నామినేషన్‌లు దాఖలు చేయగా అజయ్‌కుమార్ విరమించుకున్నారు. దీంతో అనీల్ కుమార్ ఎన్నిక ఏకగ్రీవమైంది.

టీడీపీ శాలివాహన సంఘ అధ్యక్షుడిగా పవన్‌కుమార్

కారంపూడి, మార్చి 26: టీడీపీ శాలివాహన సంఘ మండల అధ్యక్షుడిగా బొంకూరి పవన్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి నియామక ఉత్తర్వులు వెలువరించారు. టీడీపీ బలోపేతానికి కృషి చేయనున్నట్లు పవన్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బ్రహ్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీకి రాజీనామా

పిడుగురాళ్ల, మార్చి 26: పట్టణానికి చెందిన దొండేటి వెంకటరెడ్డి (డీవీ) వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు మంగళవారం తెలిపారు. తనకు వైసీపీలో సరైన గౌరవం లభించడం లేదని మనస్తాపం చెంది పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు డీవీ తెలిపారు.

వెంటనే రంగులు పూయండి...

● ఎన్నికల ప్రవర్తనా నియామళి అధికారి శంకర్‌రావు

రెంటచింతల, మార్చి 26: ఎన్నికల ప్రవర్తనా నియామళి అమలులోకి వచ్చినందున రక్షిత మంచినీటి పథకాలకు సంబంధించి ఓవర్ హెడ్ ట్యాంకులకు పార్టీ రంగులను చెరిపేసి తెల్లరంగు పూయాలని ఎన్నికల ప్రవర్తన నియామళి అమలు అధికారి పెదప్రోలు శంకరరావు కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం వివిధ గ్రామాలను సందర్శించి ఇంకా పార్టీ రంగులుండడం వల్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీల తరపున ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలకున్న రంగులను తొలగించాలన్నారు. బుధవారం ఉదయం కల్లా తెల్ల రంగు పూయాల్సిందేనన్నారు.

సీఐ చినమల్లయ్యపై ఆర్వోకు ఫిర్యాదు

మాచర్లటౌన్, మార్చి 26: టీడీపీ నేత చప్పిడి రామును దూషించి బెదిరింపులకు పాల్పడిన కారంపూడి సీఐ చినమల్లయ్యపై చర్యలు తీసుకోవాలని మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నేత యాగంటి మల్లికార్జునరావు కోరారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు మంగళవారం పట్టణంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో తహసీల్దార్ ధనుంజయరెడ్డికి ఫిర్యాదు చేశారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : కన్నా



2వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, మార్చి 26: టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఐతేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని రెండో వార్డు రంగా కాలనీలో మంగళవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలసి టీడీపీ మినీ మేనిఫెస్టోలోని పథకాల గురించి ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను, ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలను గెలిపించాలన్నారు. వార్డులోని ప్రజలు కన్నాకు హారతులు ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. పలు ఆలయాల్లో కన్నా పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, కటకం రామకృష్ణ, ఎలినేడి లక్ష్మీతులసీ, గుర్రం వెంకటేశ్వరరావు, సయ్యద్ పెద కరిముల్లా, శంకరరావు, నూర్ బాషా జానీబాబు, పసుపులేటి, ఎలినేడి లక్ష్మీతులసీ, 2వ వార్డుకు చెందిన, పట్టణానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాష్యం ప్రవీణ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి



కోనూరులో ప్రచారం నిర్వహిస్తున్న బాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య

అచ్చంపేట, మార్చి 26 : తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బాష్యం ప్రవీణ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య అన్నారు. సోమవారం మండలంలోని కోనూరు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన లావణ్య మాట్లాడుతూ అందరికి మంచి చేసే నూతన సర్కార్ రావాలని ఆమె కోరారు. సూపర్ - 6 పథకాల గురించి వివరిస్తూ సైకిల్ గుర్తుకే ఓటు వేయాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. కూటమిలోని మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొన్నారు.

నేడు బెల్లంకొండలో భాష్యం ప్రవీణ్ ప్రచారం

బెల్లంకొండ, మార్చి 26 : బెల్లంకొండ మండలంలోని బుధవారం సాయంత్రం 5 గంటలకు పెదకూరపాడు టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ ప్రచారం నిర్వహించనున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటలకు మండలంలోని న్యూచిట్యాల ఆర్‌అండ్‌ఆర్ సెంటర్, 7గంటలకు మాచాయపాలెంలో ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ ప్రచారంలో గుంటూరు మిర్చియార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి కూడా హాజరవుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని సూచించారు.

శ్రీకృష్ణదేవరాయలు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

ముప్పాళ్ళ మార్చి 26: నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 29 శుక్రవారం పర్యటించనున్నారని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీడీపీ మండల నాయకులు బత్తుల నాగేశ్వరరావు, మండల పరిశీలకులు ఆళ్ళ సాంబయ్యలు అన్నారు. ముప్పాళ్ళలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఎంపీ పర్యటనపై మండలంలోని పలు గ్రామాల నాయకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ పర్యటనలో ఇరుకుపాలెం, పలుదేవర్లపాడు గ్రామాల్లో వైసీపీకి చెందిన ప్రజా ప్రతినిదులు, మాజి ప్రజా ప్రతినిదులు చేరుతారని తెలిపారు. సమావేశంలో నాయకులు రావిపాటి నానయ్య, కట్టా రమేష్, రావిపాటి మదుబాబు, డబ్బుకొట్టు నారాయణ, గంగారాం ఖాశిం, అత్తోట వెంకటకృష్ణ, పఠాన్ లీలాఫర్, రామ్మోహన్ రెడ్డి, రహీం ద్రారెడ్డి, మాభు సుభాని, నాము శివ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● యరపతినేని శ్రీనివాసరావు తనయుడు నిఖిల్



టీఎన్‌టీయూసీ కో-ఆర్డినేటర్ల సమావేశంలో మాట్లాడుతున్న యరపతినేని నిఖిల్

పిడుగురాళ్ల, మార్చి 26: తెలుగుదేశం జనసేన ప్రవేశపెట్టిన సూ పర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా టీఎన్‌టీయూసీ కో-ఆర్డినేటర్లు పనిచేయాలని యరపతినేని శ్రీనివాసరావు తనయుడు నిఖిల్ తెలిపారు. మంగళవారం పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో నియో జకవర్గస్థాయి టీఎన్‌టీయూసీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ల సమా వేశం నిర్వహించారు. 2014 నుంచి 2019 వరకు తెలుగుదేశం ప్రభు త్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అన్ని వర్గాలకు ఏ విధంగా ఉపయోగపడ్డాయో వైసీపీ పాలనలో కార్పొరేషన్లు అన్నీ నిర్వీర్యం చేస్తూ అన్నివర్గాల ప్రజలను మోసపుచ్చిన వైనాన్ని వివరించారు. వైసీపీ అసత్య ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలన్నారు. ఈ సమావేశంలో షేక్ మున్నా, షేక్ జానీబాష, సయ్యద్ అమీర్‌అలి, యరగాని వెంకట్, నలబోతుల గాలయ్య, వట్టికుంట రాములు, కోట హరి, ఫరీద్ మేస్త్రి, ఖాశింసైదా, పిల్లి చెన్నారావు, సైదా, ఇర్షాద్, ముజీబ్, తదితరులు పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడు పుట్టిన రోజు వేడుకలు



టీడీపీ ప్రజావేదికలో కేక్ కట్ చేస్తున్న ఎలినేడి రామస్వామి, కన్నా నాగరాజు తదితరులు

సత్తెనపల్లి, మార్చి 26: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కే అచ్చెన్నాయుడు పుట్టిన రోజు వేడుకలను మంగళవారం సాయంత్రం టీడీపీ ప్రజా వేదికలో నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎలినేడి రామస్వామి, గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజులు కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొండ్రగుంట రంగారావు, మొక్కపాటి రామచంద్రరావు, కంబాల వెంకటేశ్వరరావు, ఆతుకూరి నాగేశ్వరరావు, మస్తాన్‌వలి, బలిజేపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ తోనే అభివృద్ధి : కన్నా నాగరాజు

ముప్పాళ్ళ మార్చి 26: తెలుగు దేశంపార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు అన్నారు. ముప్పాళ్ళలో కన్నా నాగరాజు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ సి.రవిచంద్రరెడ్డి

పారిశుధ్యంపై ప్రజలు సహకరించాలి

● నరసరావుపేట మునిసిపల్ కమిషనర్ రవిచంద్రరెడ్డి

నరసరావుపేట రూరల్, మార్చి 26: పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో మెరుగైన పారిశుధ్య పనులు నిర్వహించేందుకు పట్టణ ప్రజలు మునిసిపల్ కార్మికులకు సహకరించాలని మునిసిపల్ కమిషనర్ సి.రవిచంద్రరెడ్డి తెలిపారు. మంగళవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రరెడ్డి పట్టణంలోని 1వ వార్డులోని చంద్రబాబు నాయుడు కాలనీ, 4వ వార్డులోని పనసతోట వార్డు ప్రాంతాలలో నిర్వహిస్తున్నటువంటి స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ డ్రెయిన్లు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలతో మాట్లాడుతూ పారిశుధ్య పనులు నిర్వహించేందుకు కార్మికులు వచ్చినప్పుడు మీ ఇళ్ల వద్ద కాల్వలపై ఏర్పాటు చేసిన బండలను తొలగించుకొని ప్రతి ఒక్కరూ దగ్గరుండి తమ ఇళ వద్ద కాలువలు పూర్తిగా పూడిక తీయించుకోవాలని సూచించారు. అదేవిధంగా వార్డు సెక్రటరీలందరూ అందుబాటులో ఉండి మానిటరింగ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రామకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

పన్ను వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

● మునిసిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

నరసరావుపేట రూరల్, మార్చి 26: పట్టణంలోని ఇంటిపన్ను బకాయిలు ఉన్నవారు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న పన్ను వడ్డీ రాయితీని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని మునిసిపల్ అతిథి గృహంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రరెడ్డి ఇంటి పన్ను, నీటిపన్ను వసూలుపై రెవెన్యూ సిబ్బంది, సచివాలయాల సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కేటాయించిన టార్గెట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. మొండిబకాయలు ఉన్నవారి ఇళ్లకు నీటి కుళాయిలను తొలగించి ఆపై లీగల్ నోటీసు జారీచేసి అనంతరం జప్తుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం ఇచ్చినటువంటి వడ్డీ రాయితీ కేవలం ఐదు రోజులు మాత్రమే వున్నందున ఇప్పటికీ పన్నులు చెల్లించనివారు వెంటనే చెల్లించి వడ్డీ మినహాయింపు పొందాలని సూచించారు. పన్ను బకాయిల వసూలుకు ప్రత్యేక మొబైల్ కౌంటర్లు కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యాలయంలో రెండు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ కనకారావు, మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ అబ్దుల్ జబ్బర్ మున్సిపల్ మేనేజర్ శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు నరసరావుపేట మండల సర్వసభ్య సమావేశం

నరసరావుపేట రూరల్, మార్చి 26: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నేడు ఉదయం 11గంటలకు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మూరబోయిన సుబ్బాయమ్మ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజేష్ తెలిపారు. నరసరావుపేట మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని ప్రభుత్వ శాఖల మండలస్థాయి అధికారులు సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీవో రాజేష్ తెలిపారు.

ఘనంగా మహంకాళి అమ్మవారి వార్షిక తిరునాళ్ల



అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ధర్మకర్తల మండలి చైర్మన్ కొత్త సాంబశివరావు, సభ్యులు

నరసరావుపేట రూరల్, మార్చి 26: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం ఇసప్పాలెం మహంకాళి అమ్మవారి దేవస్థానం 49వ వార్షికోత్సవ తిరునాళ్ల మహోత్సవం మూడురోజులపాటు జరగనున్నాయి. తిరునాళ్ళ మొదటిరోజు మంగళవారం ఉదయం పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి టి.సుధాకరరెడ్డి తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు ధర్మకర్తల మండలి చైర్మన్ కొత్త సాంబశివరావు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం వైభవంగా జరిగింది. పూజా కార్యక్రమాలు యనమండ్ర సత్యసీతారామశర్మ, దేవాలయ అర్చకస్వామి కొత్తలంక రుద్ర వీరకాళికా సత్యకార్తికేయ, నందూరి కాలికృష్ణ జరిపించారు. దేవస్థానం ధర్మకర్తలమండలి చైర్మన్ కొత్త సాంబశివరావు, సభ్యులు కాకుమాను వెంకటబదరీ నారాయణ, బూసా సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఆలపాటి ప్రసాదరావు, దరువూరి రజని, నంద్యాల మాధవీదేవి దామోదర్, అభివృద్ధి కమిటీ వైస్‌ప్రెసిడెంట్ రాజేంద్రప్రసాద్ సభ్యులు భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

డాక్టర్ గోపిరెడ్డితో చేతులు కలిపిన వ్యతిరేక వర్గం

నరసరావుపేట, మార్చి 26: కొంత కాలంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని వ్యతిరేకిస్తూ నియోజకవర్గంలో కార్యక్రమాలు నిర్వహించిన అయన వ్యతిరేక వర్గం ఎట్టకేలకు గోపిరెడ్డితో చేతులు కలిపింది. వైసీపీ అధినేత జగన్‌మోహన రెడ్డి ఇచ్చిన హామి మేరకు తాము ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా చేపట్టిన కార్యాక్రమాలను నిలిపివేస్తున్నామని సదరు నేతలు ప్రకటించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడితో కలసి వ్యతిరేకవర్గ నేత డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి గృహంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. గోపిరెడ్డి విజయానికి కలసి పనిచేస్తామని వారు ప్రకటించారు. ఎమ్మెల్యేతో విబేధాలు వచ్చిన మాట వాస్తవమే కానీ అధిష్ఠానం తమతో చర్చలు జరిపి భవిష్యత్‌లో ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకుంటానని జగన్ హామీ ఇచ్చారని వారు తెలిపారు. పార్టీలో ఎవరికి ఎటువంటి ఇబ్బంది వచ్చినా తాము అండగా ఉంటామని డాక్టర్ గజ్జల బ్రహారెడ్డి తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి, పిల్లి ఓబుల్‌రెడ్డి, షేక్ హనీఫ్, నేలటూరి మురళి తదితరులు పాల్గొన్నారు.

అర్చకులపై దాడికి పాల్పడటం దుర్మార్గం

● రాష్ట్ర బ్రాహ్మణ సాధికార కమిటీ అధికార ప్రతినిధి శేఖర్

నరసరావుపేట టౌన్, మార్చి 26: కాకినాడ శివాలయంలో అర్చకులుగా పనిచేస్తున్న సాయిశర్మ, విజయ్‌కుమార్‌శర్మలపై ఆలయంలో దాడికి పాల్పడటం దుర్మార్గం అని రాష్ట్ర బ్రాహ్మణ సాధికార కమిటీ అధికార ప్రతినిధి గూడూరు శేఖర్ అన్నారు. మంగళవారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట జిల్లా టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గూడూరు శేఖర్ మాట్లాడుతూ దాడికి పాల్పడ్డ నిందితుడు మాజీ కార్పొరేటర్ సిరియాల చంద్రశేఖర్, అతనికి మద్దతు ఇస్తున్న ఆలయ కార్యనిర్వాహణ అధికారి, కాకినాడ జిల్లా దేవదాయశాఖ అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా రూ.285 కోట్లతో లక్షా 62 వేల కుటుంబాలకు మేలు చేశారని, పెళ్లికానుక, విదేశీ విద్య, వేద విద్య, వాహనమిత్ర పథకం కింద 30కారులు అందజేశారన్నారు. రాష్ట్రంలో సుమారుగా 40 లక్షల వరకు ఉన్నటువంటి బ్రాహ్మణ కుటుంబాలు మేలుకొని, బ్రహ్మణ సంక్షేమాన్ని తుంగలో తొక్కిన వైసీపీని రానున్న ఎన్నికలలో ఓటు అనే ఆయుధంతో సాగనంపాలన్నారు. సమావేశంలో మహేశ్వరభట్ల శ్రీనివాసశర్మ, పాలపర్తి సుధీర్, రాణి రామకృష్ణ, కృష్ణమూర్తుల అనంతారం లక్ష్మీనారాయణ, మాజేటి అరుణ, ఆమంచి వెంకటరావు శాస్త్రి, ధూళిపాళ్ళ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్‌కు జరిమానా

నరసరావుపేట లీగల్, మార్చి 26: నరసరావుపేట ఆర్టీసీ డిపో మేనేజర్‌ను విధులకు వెళ్లకుండా అడ్డుకున్న కండక్టర్‌కు జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. 2021 ఫిబ్రవరి 26న అప్పుడు నరసరావుపేట ఆర్టీసీ డిపో మేనేజరుగా విధులు నిర్వహిస్తున్న షేక్ అబ్దుల్ సలాంను అతని కార్యాలయంలో నుంచి బయటకు రాకుండా ఆర్టీసీ కండక్టర్ మార్కాపురపు జెస్సీ వివేకానంద ప్రభావతి ఆటంకపరిచినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువవ్వటంతో రూ.500 జరిమానా, చెల్లించని పక్షంలో వారం రోజులు సాధారణ జైలు శిక్ష విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ న్యాయాధికారి ప్రవలిక మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్‌ను సీనియర్ ఏపీపీ లక్ష్మీరామ్ నాయక్ నిర్వహించారు.

వైసీపీ కుట్ర రాజకీయాలకు సమాధి కడతాం

● అరవిందబాబు గెలుపు చారిత్రాత్మక అవసరం

● తెలుగుదేశం పార్టీ నాయకుల పిలుపు



నల్లపాటి రామచంద్రప్రసాదు, డాక్టర్ కడియాలను కలిసిన డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు



నరసరావుపేట టౌన్, మార్చి 26: వైసీపీ కుట్ర రాజకీయాలకు సమాధి కడతామని, అరవిందబాబు గెలుపు చారిత్రాత్మక అవసరమని టీడీపీ నాయకులు అన్నారు. మంగళవారం నరసరావుపేట టీడీపీ నేతలు టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాదులను టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవింద బాబు కలిసి రాజకీయ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ తామంతా ఒక కుటుంబమని, టీడీపీ విజయమే మా లక్ష్యమన్నారు. మా అందరి ఉమ్మడి ఏజెండా నరసరావుపేటలో తెలుగుదేశం పార్టీ జెండాను ఎగరవేయడమేనని, సమిష్టిగా పోరాటం చేసి వైసీపీ అరాచకాలను తరిమికొడతామన్నారు. నరసరావుపేటను దోచుకున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి ఈ ఎన్నికలలో ప్రజల సహకారంతో బుద్ధి చెప్తామన్నారు. అరవిందబాబు గెలుపునకు తామంతా శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేల్పుల సింహాద్రియాదవ్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు కడియాల రమేష్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్‌కుమార్, మాజీ ఎంపీపీ మొండితోక రామారావు, సుబ్బారావు ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా డాక్టర్ చదలవాడ అరవిందబాబును ప్రకటించడంపై తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గుర్రం నాగపూర్ణచంద్రరావు హర్షం వ్యక్తంచేశారు. మంగళవారం నరసరావుపేట టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో డాక్టర్ చదలవాడన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే రాష్ట్రానికి పునర్ వైభవం

పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ



పార్టీలోకి చేరిన వారిని ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు జీవీ, మక్కెన

శావల్యాపురం, మార్చి 26: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి అధికారంలోకి వస్తేనే వైసీపీ అరాచక పాలనతో 30ఏళ్లు వెనుకబడ్డ రాష్ట్రాన్ని మరలా గాడినపెట్టి పునర్‌వైభవాన్ని తేగలమని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. శావల్యాపురంలో సోమవారం రాత్రి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు వచ్చి విలేకరులతో మాట్లాడారు. రాజకీయ లబ్ధికోసం రాష్ట్రాన్ని మూడుముక్కలుగా విభజించి పాలించాలన్న సీఎం జగన్‌కు రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పనున్నారని అన్నారు. పల్నాడు జిల్లాలో ఫ్లోరిన్ సమస్యను పరిష్కరించేందుకు వాటర్‌గ్రిడ్ ఏర్పాటుకు రూ.640కోట్లు నిధులు తెస్తే పనులు చేయడం చేతకాక వదిలేశారని, కూటమి అధికారంలోకి రాగానే వాటర్‌గ్రిడ్‌ను తెచ్చి ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటుచేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కృషితో కేంద్రం వినుకొండకు మంజూరు చేసిన జాతీయ రహదారి, బొల్లాపల్లి మండలానికి మంజూరైన వరికపూడిశెల ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తామని, వినుకొండలో అగ్రికల్చర్ కాలేజీ, టీటీడీ కళ్యాణ మండపాలను నిర్మించి అభివృద్ధిపథంలో తీర్చిదిద్దుతామన్నారు.

బొల్లాను చిత్తుచిత్తుగా ఓడిస్తా: జీవీ

శావల్యాపురం, మార్చి 26: అధికారాన్ని అడ్డుపెట్టుకొని అహంకారంతో విర్రవీగుతూ ప్రజలపై దౌర్జన్యాలు, దాడులు చేసి వినుకొండ నియోజకవర్గంలో అశాంతిని రేకెత్తించిన బొల్లా బ్రహ్మనాయుడిని రానున్న ఎన్నికలలో 30వేల మెజారిటీతో చిత్తుచిత్తుగా ఓడించి ఆయనకు రిటర్న్ గిఫ్ట్ పంపిస్తానని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. శావల్యాపురంలో నూతనంగా ఏర్పాటుచేసిన టీడీపీ కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలసి ఆయన సోమవారం రాత్రి ప్రారంభించారు. కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీవీ మాట్లాడుతూ ఐదేళ్ళ పాలనలో ఇసుక, మద్యం, రేషన్ మాఫియాలతో బొల్లా కోట్లాది రూపాయలు దోచుకున్నాడని, నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు, వివాదాస్పద భూములను ఆక్రమించి వేలాది ఎకరాలు పోగు చేశాడన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గానికి 10మంది ఎమ్మెల్యేలుగా చేసినా బొల్లా ఒక్కడే అభివృద్ధి చేసినట్లుగా గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు, బీజేపీ నేత నలబోలు విష్ణు, జనసేన మండలాధ్యక్షుడు అడపాల అనిల్‌కుమార్, టీడీపీ నేతలు గడిపూడి విశ్వనాథం, బొల్లా పేరయ్య, గోరింట్ల హనుమంతరావు, గద్దె వీరమస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనపై విరక్తితోనే టీడీపీలోకి చేరికలు

ఐదేళ్ళపాటు వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచక పాలనపై విరక్తి చెందిన కార్యకర్తలంతా భారీగా టీడీపీలోకి చేరుతున్నారని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. శావల్యాపురంలోని టీడీపీ కార్యాలయంలో కొత్తగా పార్టీలోకి చేరిన శావల్యాపురం, ఇర్లపాడు, కొత్తలూరు గ్రామాల కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యేలు జీవీ, మక్కెనలు పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. శావల్యాపురం బీసీకాలనీలో 25కుటుంబాలు, ఎస్సీకాలనీలో 15కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరాయి.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం



గుట్టపల్లి గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

బొల్లాపల్లి, మార్చి 26 : మండలంలోని గుట్లపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు గుట్లపల్లిలో ఎన్నికల ప్రచారం శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. గుట్లపల్లిలో కుటుంబ సాధికార సారథులతో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులతో కలసి ఇంటింటికి వెళ్ళి మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా బొల్లాపల్లి మండలంలో వ్యవసాయరంగం బోర్లపై ఆధారపడి ఉన్నందున శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీఇచ్చారు. ఓల్టేజీ సమస్య వల్ల బోర్లు సరిగా పనిచేయటం లేదని, మండలంలో 130 కేవీ సబ్ స్టేషన్‌ను ఏర్పాటుచేసి త్రీఫేజ్ కరెంటు సరఫరా చేస్తామన్నారు. స్థానికంగా ఎంతోకాలంగా ఉన్న తాగునీటి సమస్యకు కూడా పూర్తి స్థాయిలో పరిష్కారం చూపిస్తామని, రానున్న రోజుల్లో ఇంటింటికి మంచి నీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జరపాల గోవిందునాయక్, పెమ్మసాని నాగేశ్వరరావు, హనుమానాయక్, సక్రూ నాయక్, అర్ధలపూడి శ్రీనివాసరావు, ఎ.రంగయ్య, సంపతు మన్నెపెల్లి, ఆళ్ళ మన్నెయ్య, ఏడుకొండలు నాయక్, టి.వెంకటేశ్వర్లు, దాసరి కోటేశ్వరరావు, వై.వెంకటేశ్వర్లు, పలువురు టీడీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర చరిత్రలో జగన్‌లాంటి మోసకారి లేడు

● మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, మార్చి 26: రాష్ట్ర చరిత్రలో జగన్ లాంటి మోసకారి లాంటి ముఖ్యమంత్రి లేడని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ళలో వందకు పైగా సంక్షేమ పథకాలను రద్దు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. అలాంటి వ్యక్తి పేదల పక్షపాతి ఎలా అవుతారో చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ దొంగల ముఠా బెడద మరికొన్ని రోజుల్లోనే రాష్ట్రానికి తొలగనున్నదన్నారు. జగన్ ఐదేళ్లపాలన, హామీలను తుంగలోకి తొక్కారన్నారు. నేను విన్నాను నేను ఉన్నాను అంటూనే పేద, మధ్య తరగతిని కోలుకోలేని రీతిలో దోపిడీ చేశారని ధ్వజమెత్తారు.

వైయస్ కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేయాలంటూ ఏం చెబుతారని, మద్య నిషేదం మరిచినందుకా, అమరావతి ఉసురు తీసినందుకా, పోలవరాన్ని అస్తవ్యస్తం చేసినందుకా, మెగా డీఎస్సీని మరిచినందుకా, ఇసుకను బంగారంతో సమానం చేసినందుకా, కరెంటు చార్జీల మోతతో ప్రజలను అల్లాడిస్తున్నందుకా అని జీవీ ప్రశ్నించారు. పల్నాడు ప్రాంతాన్ని శాపంగా వెంటాడుతున్న కరువు విముక్తి పథకాన్ని కనీసం పట్టించుకోని ఈ ప్రభుత్వానికి మరలా ఓటు ఎందుకు వేయాలో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

జాతీయ రహదారిపై తనిఖీలు



చీకటీగలపాలెం వద్ద వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

వినుకొండ, మార్చి 26: రానున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని వినుకొండ, మార్కాపురం రోడ్డు జాతీయ రహదారిపై డీఎస్పీ వర్మ, సీఐ సాంబశివరావు ఆధ్వర్యంలో వాహన తనిఖీ కార్యక్రమాన్ని బుధవారం రాత్రి చేపట్టారు. మార్కాపురం వైపు నుంచి వినుకొండ వైపు వస్తున్న కార్లు, లారీలు, ఆటోలను నిశితంగా తనిఖీచేశారు. అనంతరం నడిగడ్డ నుంచి కొప్పుకొండకు వెళ్ళే ప్రధాన రహదారి వెంబడి ఉన్న గ్రామాల్లో ఎన్నికల్లో అల్లర్లు అరికట్టే కార్యక్రమాల్లో భాగంగా రూట్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సాంబశివరావు మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

కాంగ్రెస్ గూటికి చెన్నా శ్రీనివాసరావు

వినుకొండ టౌన్, మార్చి: 2019 ఎన్నికల్లో జనసేన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసిన చెన్నా శ్రీనివాసరావు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనతోపాటు కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో శావల్యాపురం వైసీపీ కార్యదర్శి చెన్నంశెట్టి మణి, వెంకుపాలెంకు చెందిన అడపాల రతయ్య కూడా కాంగ్రెస్ పార్టీలో చేరినవారిలో ఉన్నారు.

తారురోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు: ఏఈ

శావల్యాపురం, మార్చి 26: ఇటీవల కురిసిన వర్షాలకు వినుకొండ నియోజకవర్గం పరిధిలో చెడిపోయిన రోడ్లకు మరమ్మతులు నిర్వహించేందుకు ప్రభుత్వం రూ.3.50కోట్లు నిధులను మంజూరు చేసిందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కంచేటి నవ్య మంగళవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ శావల్యాపురం- కారుమంచి రోడ్డు మరమ్మతులకు రూ.40లక్షలు, శావల్యాపురం- కొచ్చర్ల రోడ్డు మరమ్మతులకు రూ.10లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. త్వరలో మిగిలిన రోడ్లకు కూడా మరమ్మతులను ప్రారంభిస్తామన్నారు. ఎన్నికల కోడ్ రాకముందే మరమ్మతులకు నిధులు మంజూరవ్వడంతో కోడ్‌కు ముందే పనులు ప్రారంభించామని తెలిపారు.





తృతీయ బహుమతి సాధించిన చిత్రం, పక్కన జస్టిస్

జాతీయ స్థాయి పోటీల్లో జస్టిస్‌కు తృతీయ బహుమతి

వినుకొండ, మార్చి 26: ఈ నెల 23వ తేదీన విజయవాడలో స్ఫూర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో వినుకొండ ప్రముఖ చిత్రకారుడు వజ్రగిరి జస్టిస్‌కు సీనియర్ విభాగంలో తృతీయ బహుమతి, ఆయన కుమారుడు బెన్‌జెసన్‌కు జూనియర్ స్టూడెంట్స్ విభాగంలో మొదటి కన్సోలేషన్ బహుమతి లభించినట్లు వజ్రగిరి జస్టిస్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వజ్రగిరి జస్టిస్‌కు చిత్రకారులు, రాజకీయ ప్రముఖులు, కళాకారులు, పాస్టర్లు, ఉపాధ్యాయులు తదితరులు అభినందనలు తెలిపారు.



వేల్పూరులో ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ వర్మ

వివాదాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు : డీఎస్పీ వర్మ

వేల్పూరు (శావల్యాపురం) మార్చి 26: రానున్న ఎన్నికల్లో ప్రజలంతా వివాదాలకు దూరంగా ఉండాలని, లేనిపోని గొడవల్లో తలదూర్చి కేసుల జోలికెళ్ళి జీవితాలు నాశనం చేసుకోవద్దని నర్సరావుపేట డీఎస్పీ వీఎస్‌ఎన్ వర్మ అన్నారు. మండలంలోని వేల్పూరులో కేంద్ర బలగాలతో మంగళవారం మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా ప్రజలంతా సహకరించాలన్నారు. ఎన్నికల సంఘం రూపొందించిన సీ-విజిట్ యాప్‌ను ప్రజలంతా డౌన్‌లోడ్ చేసుకొని కళ్లెదుట జరిగే వివాదాలను ఫోటోలు తీసిపెడితే 24గంటల వ్యవధిలో పరిష్కరించడం జరుగుతుందన్నారు. వినుకొండ పట్టణ సీఐ సాంబశివరావు, రూరల్ సీఐ సుధాకర్‌రావు, ఎస్ఐలు సురేష్, లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.



రామాంజనేయులను సన్మానిస్తున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

టీడీపీతోనే బీసీలకు మెరుగైన సంక్షేమం

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, మార్చి 26 : రాష్ట్రంలో బీసీలకు మెరుగైన అవకాశాలు కల్పించాలని, వారి సంక్షేమానికి పెద్ద పీట వేసింది తెలుగుదేశం పార్టీ మాత్రమేనని మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. చిలకలూరిపేట మండలం బొప్పూడి గ్రామానికి చెందిన డేరంగుల రామాంజనేయులు టీడీపీ బీసీ సెల్ పల్నాడు జిల్లా కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా మాజీ మంత్రి ప్రత్తిపాటిని మర్యాద పూర్వకంగా వారి నివాసంలో కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు బీసీ నాయకులు రామాంజనేయులును శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ పార్టీ అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి అందరినీ కలుపుకుపోయి పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. ఎన్‌టీఆర్ నుంచి చంద్రబాబు, లోకేశ్ వరకు బీసీలకు ప్రాధాన్యం ఇస్తున్నారని, తెలుగుదేశం పార్టీ నిజమైన బీసీల చాంపియన్ అన్నారు. బీసీల కోసం ప్రత్యేక మేనిఫెస్టో తీసుకు వస్తున్న పార్టీ కూడా టీడీపీ మాత్రమేనని గుర్తు చేశారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బీసీల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు ఆదరణ రుణాలతో ఎనలేని కృషి చేశారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ నేతలు తన్నీరు పుల్లారావు, బి.సుబ్బారావు, జంగా వినాయకరావు తదితరులు పాల్గొన్నారు.

సంతగుడిపాడులో బాబు ష్యూరిటీపై ప్రచారం

రొంపిచర్ల, మార్చి 26: మండలంలోని సంతగుడిపాడులో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంపై ఆదివారం రాత్రి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో పర్యటించి సూపర్-6 పథకాల గురించి వివరించారు. ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే అభ్యర్థి చదలవాడ అరవిందబాబులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వడ్లమూడి కిషోర్, జెల్లిపల్లి శేషమ్మ, మంజుల అంజనీకుమారి, మామిళ్ళపల్లి ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

అసమర్ధ పాలనతో జగన్ విఫలం

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు


చిలకలూరిపేట అర్బన్, మార్చి 26: రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్ అసమర్ధ పాలతో విఫలమయ్యారని మాజీమంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. మంగళవారం పట్టణంలోని 6, 38 వార్డుల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్తిపాటి ఇంటింటికి తిరిగి సూపర్-6 పథకాల గురించి ప్రజలకు వివరించి కరపత్రాలను పంచి పెట్టారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ అధికారంలో ఉండి ప్రజల బాగోగులు చూడటం, ఇచ్చిన మాట నిలబెట్టుకోవటం అంటే అబద్ధాలు చెప్పినంత సులువు, హత్యా రాజకీయాలు చేసినంత ఆషామాషీ కాదని జగన్ ఇప్పటికైనా గమనిస్తే మేలు అన్నారు. 99శాతం హామీలు అమలు చేశానని ప్రచారం చేసుకుంటున్న జగన్ నిజానికి ఇచ్చిన హామీల్లో 85శాతం నెరవేర్చలేదని ప్రత్తిపాటి తెలిపారు. జగన్ ఇచ్చి మరచిన హామీల గురించి ప్రస్తావించారు. మద్య నిషేధం అన్న మాట గాలికి వదిలి నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలు తీస్తున్నారని, అలాగే కరెంటు చార్జీలు తగ్గిస్తానని అధికారంలోకి వచ్చి తొమ్మిది సార్లు చార్జీలు పెంచారని, 2.30 లక్షల ఉద్యోగాలు వస్తాయని చెప్పి నిరుద్యోగులను మోసం చేశారని, డీజిల్, పెట్రోల్ ధరల్లో దేశంలోనే ఏపీని, నెంబర్ స్థానంలో నిలిపిన జగన్ అరాచకాలను ప్రజలు భరిస్తున్నారని, వాటన్నింటికీ పరిష్కారంగా ఒకే సారి బటన్ నొక్కి జగన్‌ను ఇంటికి సాగనంపటానికి ప్రజలందరూ సంసిద్ధంగా ఉన్నారని ప్రత్తిపాటి తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పఠాన్ సమద్‌ఖాన్, మద్దమాల రవి, వార్డు కౌన్సిలర్ జంగా సుజాత, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఏపీని డ్రగ్స్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన సీఎం జగన్'

చిలకలూరిపేట అర్బన్, మార్చి 26: విశాఖపట్నం పోర్టులో దొరికిన 2500 కిలోల డ్రగ్స్ వైసీపీ నాయకులకు చెందినదని, వైసీపీ ఎంపీలకు బ్రెజిల్‌లో డ్రగ్స్ వ్యాపారంతో ఉన్న సంబంధాలు నిన్నటితో బయటపడ్డాయని రాష్ట్ర తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి జెరీనా సుల్తానా అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన తెలుగు మహిళా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు అమరా రమాదేవి మాట్లాడుతూ వైసీపీ నాయకులు సీబీఐ అధికారుల మీద ఒత్తిడి తీసుకువచ్చి డ్రగ్స్ కంటైనర్ తెరవరకుండా విశ్వప్రయత్నం చేశారనే విషయం ప్రజలకు అర్థమైందన్నారు. ఓటు అనే ఆయుధంతో ఈ వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని వారు కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా కార్యదర్శి పోపూరి లక్ష్మి, పట్టణ మహిళా అధ్యక్షురాలు అద్దంకి అనితా బాయిలు పాల్గొన్నారు.

యువ శాస్త్రవేత్తకు సత్కారం

చిలకలూరిపేట, మార్చి 26: పట్టణంలోని ఆర్‌వీఎస్ స్కూల్ ఎదురుగా ఉన్న మెహర్‌బాబా మందిరంలో మంగళవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో యువత శాస్త్రవేత్త డాక్టర్ షేక్ అల్లాభక్షి అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. సివిల్ ఇంజనీరులో ఎంటెక్ చేసి ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీచేసి అమెరికాలోని ప్రభుత్వరంగ సంస్థ కేనాటిక్ కట్ అగ్రికల్చరల్ రీసెర్చ్ స్టేషన్ గవర్నమెంట్ ఆఫ్ యూఎస్‌లో ఎన్విరాన్‌మెంట్ శాస్త్రవేత్తగా వ్యవసాయాభివృద్ధి పరిశోధనలో శాఖలో బాధ్యతలు చేపట్టనున్న సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు ఏవీ శివయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు పట్టాభి రామారావు తదితరులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టి అత్యున్నత పదవి చేపట్టడంపై అభినందనలు తెలిపారు. ఆయన తల్లిదండ్రులు సలీం దంపతులను అభినందించారు. అనంతరం శాస్త్రవేత్త షేక్ అల్లాభక్షిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉమర్, జిలానీ, సనా, దివి రామ బ్రహ్మం, బి.కోటయ్య, ఆరోన్, సిద్ధాంతి కరిముల్లా, చుక్కా విన్సెంట్‌పాల్, పీవీ సుబ్బారావు, దార్ల బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.



పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు అందజేస్తున్న చిలకలూరిపేట అర్బన్ సీఐ రమేష్

పోగొట్టుకున్న సెల్ ఫోన్‌లు అందజేత

చిలకలూరిపేట, మార్చి 26: చిలకలూరిపేట ప్రాంతంలో గత కొద్ది రోజులుగా సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న నలుగురికి వాటిని రికవరీచేసి మంగళవారం పోలీసులు అందజేశారు. అర్బన్ పోలీసు స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో సీఐ రమేష్ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లు చోరీకి గురికాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఒకవేళ ఎవరైనా ఫోన్‌లు పోగొట్టుకుంటే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ సందర్భంగా బాధితులకు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.